చదవండి.. చదివించండి..
నేటి శుభోదయ
ప్రతిక్షణం.. ప్రజల కోసం...
నిజమైన వార్తలు... నమ్మకమైన పత్రిక
నిష్పక్ష వార్తలు | నిజాయితీ జర్నలిజం | ప్రజల గొంతుక
వార్తలు, ప్రకటనల కోసం సంప్రదించండి
మా వెబ్‌సైట్ www.netishubhodaya.com | వాట్సాప్ 96965 71571
మీ నమ్మకం.. మా బాధ్యత.. శుభోదయంతో ప్రతి ఉదయం ప్రగతివైపు!

RNI TELTEL/2024/89620
తెలంగాణ

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక

GK MEDIA
Voice of People
CHANNEL NO. 433
SSLC CABLE NETWORK
SSLC కేబుల్ నెట్‌వర్క్‌లో వస్తుంది

ప్రచురణ : తెలంగాణ | సంపుటి 01 | సంచిక 183 | సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు | పేజీలు - 08 | ఆదివారం 23 - ఆగష్టు - 2026 | వెల రూ. 5 /-

## గచ్చిబౌలిలో కూలిన ఏడంతస్తుల అక్రమ కట్టడం

# ఇద్దరి దుర్మరణం

### - అక్రమ కట్టడాలన్నీ కూల్చేస్తామన్న హైడ్రా కమిషనర్

**గచ్చిబౌలి అంజయ్య నగర్‌లో 50 గజాల్లో నిర్మిస్తున్న ఏడంతస్తుల అక్రమ భవనం కుప్పకూలి ఇద్దరు కార్మికులు మృతి**

**ఘటనా స్థలాన్ని పరిశీలించి కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్**

**'విక్టిమ్ లొకేషన్ సిస్టమ్'తో శిథిలాల నుంచి మృతదేహాలు వెలికితీత.. గాయపడిన వ్యక్తికి చికిత్స**

**అధికారులకు ముడుపులిచ్చి పనులు కొనసాగించారని స్థానికుల ఆరోపణ..**

**సెట్‌బ్యాక్‌లు లేని భవనాలపై ప్రత్యేక డ్రైవ్ చేపడతామని వెల్లడి**

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** హైదరాబాద్ గచ్చిబౌలిలోని అంజయ్య నగర్‌లో శనివారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మాదాపూర్ సర్కిల్ పరిధిలో నిర్మాణంలో ఉన్న ఓ ఏడంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో మధ్య ప్రదేశ్‌కు చెందిన మోహత్, ఉమేష్ అనే ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందగా, రమణారెడ్డి అనే మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందిన వెంటనే హైడ్రా, డీఆర్ఎఫ్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. 'విక్టిమ్ లొకేషన్ సిస్టమ్' సహాయంతో శిథిలాల నుంచి రెండు మృతదేహాలను వెలికితీసి పోలీసులకు .....

2



## బీజేపీ కొత్త టీమ్‌తో ప్రధాని మోదీ భేటీ



2

## రూ.7,000 కోట్లతో కొత్త ఎల్‌పీజీ పైప్‌లైన్లు.. తెలంగాణకు ప్రయోజనం

- రూ.7,000 కోట్లతో ఎల్‌పీజీ పైప్‌లైన్ విస్తరణకు కేంద్రం ఆమోదం
- తెలంగాణలోని చర్లపల్లి నుంచి నాగ్‌పూర్ వరకు కీలక మార్గం
- దేశవ్యాప్తంగా 1,800 కిలోమీటర్ల మేర కొత్త లైన్ల నిర్మాణం
- ప్రాజెక్టును చేపట్టనున్న గెయిల్ ఇండియా లిమిటెడ్
- తగ్గనున్న రవాణా ఖర్చులు, ప్రమాదాల ముప్పు



2

## మేడిగడ్డ 7వ బ్లాక్‌లో కాంక్రీట్ నాణ్యత డొల్ల..

- తేల్చేసిన సీడబ్ల్యూపీఆర్ఎస్ నివేదిక



2

## నా కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకున్న

# సూత్రధారులను గుర్తించాలి

### - కొండా సురేఖ

**టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి మంత్రి కొండా సురేఖ మరో లేఖ**

**తనను, తన కుటుంబాన్ని కొందరు నేతలు లక్ష్యంగా చేసుకున్నారని ఆవేదన**

**విచారణ జరుగుతుండగా బహిరంగ విమర్శలు చేయడం సరికాదని సూచన**

**ముఖ్యమంత్రిపై కుమార్తె వ్యాఖ్యలను సురేఖ ఖండించాలని చెప్పిన మల్లు రవి**



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి బహిరతమయ్యాయి. రాష్ట్ర మంత్రి కొండా సురేఖ టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి మరోసారి లేఖ రాశారు. కొందరు పార్టీ నేతలు ఉద్దేశపూర్వకంగా తనను, తన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నారని ఆమె ఆ లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. తనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వారి వెనుక ఉన్న సూత్రధారులను గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కమిటీ ఛైర్మన్ మల్లు రవిని ఆమె కోరారు. కమిటీ పంపిన నోటీసుకు తాను ఇప్పటికే వివరణ ఇచ్చానని కొండా సురేఖ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఒక అంశంపై విచారణ కొనసాగుతున్న తరుణంలోనే, సొంత పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, ఇతర నేతలు బహిరంగంగా విమర్శలు చేయడం సమంజసం కాదని, ఈ విషయాన్ని కమిటీ తీవ్రంగా పరిగణించాలని ఆమె తన లేఖలో పేర్కొన్నారు. కాగా, ఈ లేఖ రాయడానికి ముందు క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి ఈ అంశంపై స్పందించారు. కొండా సురేఖ సమర్పించిన వివరణపై కమిటీ ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని ఆయన స్పష్టం చేశారు. అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఆమె కుమార్తె చేసిన వ్యాఖ్యలను ఒక బాధ్యతాయుతమైన మంత్రిగా సురేఖ ఖండించి ఉండాల్సిందని ఆయన అభిప్రాయపడ్డారు. సహజ న్యాయ సూత్రాల ప్రకారం ఆ వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని కొండా సురేఖ వాదిస్తున్నట్లు మల్లు రవి పేర్కొన్నారు. ఇదే సమయంలో, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోతో పాటు ఆయన ఇచ్చిన వివరణను కూడా పరిశీలించినట్లు వెల్లడించారు. ఇక కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలపై తమకు ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, దీనిని సుమోటోగా స్వీకరించాలా? వద్దా? అనే అంశంపై యోచిస్తున్నామని ఆయన వివరించారు.

## హైదరాబాద్‌లో భారీ పన్ను ఎగవేత గుట్టురట్టు



- హైదరాబాద్‌లో భారీ పన్ను ఎగవేత రాకెట్ బట్టబయలు
- అక్రమ పాన్ మసాలా యూనిట్‌పై సీజీఎస్టీ అధికారుల దాడులు
- సుమారు రూ. 160 కోట్ల మేర పన్ను ఎగవేసినట్లు నిర్ధారణ
- భారీగా ముడిసరుకు, 40 యంత్రాలు స్వాధీనం.. కీలక వ్యక్తి అరెస్ట్

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** హైదరాబాద్‌లో భారీ జీఎస్టీ ఎగవేత గుట్టును హైదరాబాద్ సెంట్రల్ జీఎస్టీ (సీజీఎస్టీ) అధికారులు రట్టు చేశారు. నగర శివార్లలోని ఒక రేకుల షెడ్డులో రహస్యంగా నిర్వహిస్తున్న పాన్ మసాలా, పొగాకు తయారీ యూనిట్‌పై దాడి చేసి, సుమారు రూ. 160 కోట్ల మేర పన్ను ఎగవేతను గుర్తించారు. ఈ అక్రమ దందాను నిర్వహిస్తున్న కీలక వ్యక్తిని అధికారులు అరెస్ట్ చేశారు. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ యూనిట్‌లో ఎటువంటి అనుమతులు లేకుండానే పాన్ మసాలా, సుగంధ జర్దా వంటి ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. తనిఖీల సమయంలో లెక్కల్లో చూపని 40 ప్యాకింగ్ యంత్రాలను ....

2

## జేడీ వాన్స్, జోహ్రాన్ మమ్దానీలతో

# భేటీకి రేవంత్ ప్లాన్

### కేంద్రం అందుకే అనుమతి నిరాకరించిందా?

- రేవంత్ రెడ్డి అమెరికా టూర్‌కు కేంద్ర అనుమతి నిరాకరణ
- జేడీ వాన్స్, మమ్దానీలతో సమావేశానికి రేవంత్ ప్లాన్ చేసినట్లు సమాచారం
- ఆ విషయాన్ని విదేశాంగ శాఖకు వెల్లడించలేదని సమాచారం



2

## చెక్ బుక్‌లపై కొత్త రూల్స్..



- చెక్ మోసాల నివారణకు బ్యాంకుల్లో కొత్త భద్రతా ప్రమాణాలు
- 'ఆల్ఫాన్యూమరిక్ కోడ్'తో కొత్త సిరీస్ చెక్ బుక్‌ల జారీ
- పాత చెక్ బుక్‌ల మార్పుపై బ్యాంకులను సంప్రదించాలని సూచన
- డిసెంబర్ 31 డెడ్‌లైన్‌పై వస్తున్న వార్తలు అన్ని బ్యాంకులకు వర్తించని వైనం
- అధిక విలువ గల లావాదేవీలకు ఇప్పటికీ చెక్కుల వినియోగం తప్పనిసరి

# మేడిగడ్డ 7వ బ్లాక్‌లో కాంక్రీట్ నాణ్యత డొల్ల..

## - తేల్చేసిన సీడబ్ల్యూపీఆర్ఎస్ నివేదిక

**మొదటిపేజీ తరువాయి..** కాళేశ్వరం ప్రాజెక్టులో అత్యంత కీలకమైన మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణ నాణ్యతపై మరో విస్మయకర అంశం వెలుగులోకి వచ్చింది. రెండేళ్ల క్రితం కుంగిపోయిన బ్యారేజీలోని 7వ బ్లాక్‌లో కాంక్రీట్ నాణ్యత అత్యంత పేలవంగా ఉన్నట్లు పుణెకు చెందిన సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్ఎస్) తన నివేదికలో స్పష్టం చేసింది. బ్యారేజీ పునరుద్ధరణ పనుల అంచనాలో భాగంగా నిర్వహించిన వివిధ పరీక్షల్లో ఈ చేదు నిజం వెల్లడైంది. సీడబ్ల్యూపీఆర్ఎస్ నిర్వహించిన అల్ట్రాసోనిక్ పల్స్ వెలాసిటీ, రీబౌండ్ హ్యామర్ పరీక్షల్లో 7వ బ్లాక్‌లోని 16 నుంచి 21వ సంఖ్య గల పియర్‌లలో కాంక్రీట్ నాణ్యత అత్యంత తక్కువగా లేదా అనుమానాస్పదంగా ఉన్నట్లు తేలింది. ముఖ్యంగా పియర్-19లో గరిష్ఠంగా 73.3 శాతం, పియర్-18లో 65.5 శాతం, పియర్-20లో 61.1 శాతం మేర నాణ్యత లోపాలు ఉన్నట్లు నివేదిక పేర్కొంది. నిర్మాణంలో నాణ్యత లోపించడం, నీటి ప్రవాహ ఉద్ధృతికి కాంక్రీట్‌లో ఖాళీలు ఏర్పడటమే 2023లో ఈ బ్లాక్ కుంగిపోవడానికి ప్రధాన కారణమై ఉండవచ్చని నిపుణులు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో, 7వ బ్లాక్ పునరుద్ధరణకు సంబంధించి మరిన్ని లోతైన పరిశీలనలు, అదనపు పరీక్షలు నిర్వహించాలని సీడబ్ల్యూపీఆర్ఎస్ సిఫార్సు చేసింది. అయితే, మేడిగడ్డలోని 1 నుంచి 6 వరకు, 8వ బ్లాక్‌లలో కాంక్రీట్ నాణ్యత సంతృప్తికరంగానే ఉందని నివేదిక వివరించింది. అలాగే, అన్నారం బ్యారేజీలో ఎటువంటి నాణ్యత లోపాలు తలెత్తలేదని, సుందిళ్ల బ్యారేజీలోనూ కాంక్రీట్ నాణ్యత స్థిరంగానే ఉందని నివేదిక వెల్లడించింది.

## హైదరాబాద్‌లో భారీ పన్ను ఎగవేత గుట్టురట్టు

**మొదటిపేజీ తరువాయి..** అధికారులు కనుగొన్నారు. ఈ ఫ్యాక్టరీలో మొత్తం 56 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఇక్కడ తయారైన సరుకును జీఎస్టీ, హెచ్ఎస్ఎన్ఎస్ సెస్, సెంట్రల్ ఎక్సైజ్ సుంకాలు చెల్లించకుండానే మార్కెట్‌కు తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. దాడుల్లో భాగంగా రవాణాకు సిద్ధంగా ఉన్న రూ. 76 లక్షల విలువైన సరుకుతో పాటు, 5,500 కిలోల రెడీమేడ్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు 2,015 కిలోల పాన్ మసాలా మిశ్రమం, 810 కిలోల పొగాకు, ప్యాకింగ్ మెటీరియల్‌తో పాటు అక్రమ రవాణాకు ఉపయోగిస్తున్న రెండు వాహనాలను సీజ్ చేశారు. పాన్ మసాలా, పొగాకు ఉత్పత్తులపై 2026 ఫిబ్రవరి నుంచి అమల్లోకి వచ్చిన కొత్త పన్ను నిబంధనల నుంచి తప్పించుకోవడానికే ఇటువంటి అక్రమాలకు పాల్పడుతున్నట్లు అధికారులు భావిస్తున్నారు. పట్టుబడిన స్టాక్, యంత్రాల సామర్థ్యం, పనిచేస్తున్న కార్మికుల సంఖ్య ఆధారంగా మొత్తం పన్ను ఎగవేత రూ. 160 కోట్లుగా ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఈ రాకెట్‌లో ప్రధాన సూత్రధారిని అరెస్ట్ చేయగా, ప్రత్యేక ఆర్థిక నేరాల కోర్టు అతనికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది.

# చెక్ బుక్‌లపై కొత్త రూల్స్..

**మొదటిపేజీ తరువాయి..** మీరు ఇప్పటికీ బ్యాంకింగ్ లావాదేవీల కోసం చెక్కులను వాడుతున్నారా? అయితే, మీ చెక్ బుక్‌లో కొత్త భద్రతా ఫీచర్లు ఉన్నాయో? లేదో? ఒకసారి సరిచూసుకోవడం చాలా అవసరం. చెక్ మోసాలను అరికట్టి, లావాదేవీల భద్రతను పెంచే లక్ష్యంతో బ్యాంకులు సరికొత్త చెక్ బుక్‌లను జారీ చేస్తున్నాయి. వీటిలో 'ఆల్ఫాన్యూమరిక్ కోడ్' అనే ప్రత్యేకమైన భద్రతా ఫీచర్‌ను జోడిస్తున్నాయి.

### భద్రత కోసమే కొత్త చెక్ బుక్‌లు

ఇటీవల బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) వంటి పలు బ్యాంకులు తమ చెక్కులపై ఆల్ఫాన్యూమరిక్ కోడ్‌ను ప్రవేశపెట్టాయి. పాత చెక్ బుక్‌ల స్థానంలో ఈ కొత్త సిరీస్ చెక్ బుక్‌లను తీసుకోవాలని తమ ఖాతాదారులకు సూచిస్తున్నాయి. అక్షరాలు, అంకెల కలయికతో ఉండే ఈ కోడ్, చెక్కులను క్లియరింగ్ సమయంలో సులభంగా గుర్తించి, ధ్రువీకరించడానికి సహాయపడుతుంది. తద్వారా నకిలీ లేదా ట్యాంపరింగ్ చేసిన చెక్కుల ద్వారా జరిగే మోసాలకు అడ్డుకట్ట వేయవచ్చని బ్యాంకులు భావిస్తున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కూడా 'చెక్ ట్రంకేషన్ సిస్టమ్' (సీటీఎస్) ద్వారా చెక్ క్లియరింగ్ వ్యవస్థను వేగవంతం, పటిష్ఠం చేస్తోంది. ఈ విధానంలో చెక్ భౌతికంగా కాకుండా, దాని ఎలక్ట్రానిక్ ఇమేజ్ ద్వారా క్లియరింగ్ జరుగుతుంది. దీంతో సమయం ఆదా అవ్వడంతో పాటు భద్రత కూడా పెరుగుతుంది.

### డిసెంబర్ 31 గడువు నిజమేనా?

కొన్ని రకాల పాత చెక్కులకు, ముఖ్యంగా రూ. 50,000 లేదా అంతకంటే ఎక్కువ విలువైన వాటికి 2026 డిసెంబర్ 31 చివరి గడువు అంటూ కొన్ని నివేదికలు వస్తున్నాయి. అయితే, ఇది అన్ని బ్యాంకులకు వర్తించే ఆర్‌బీఐ అధికారిక గడువు కాదని వినియోగదారులు గమనించాలి. ప్రతి బ్యాంకుకు దాని సొంత నిబంధనలు ఉండవచ్చు. కాబట్టి, మీ పాత చెక్ బుక్ చెల్లుబాటు అవుతుందో లేదో తెలుసుకోవడానికి, మీ బ్యాంకు అధికారిక వెబ్‌సైట్‌ను చూడటం లేదా నేరుగా బ్రాంచ్‌ను సంప్రదించడం ఉత్తమమైన మార్గం.

### ఖాతాదారులు ఏం చేయాలి?

ముఖ్యంగా వ్యాపారం, ఆస్తుల కొనుగోలు, రుణాలు వంటి అధిక విలువ కలిగిన చెల్లింపులు చేసేవారు తమ బ్యాంకు సూచనలను తప్పక పాటించాలి. మీ పాత చెక్ బుక్‌ను మార్చుకోవాలని బ్యాంకు సూచిస్తే, తదుపరి లావాదేవీకి ముందే ఆ పని పూర్తి చేయడం మంచిది. కొత్త చెక్ బుక్ ఖరీదు బ్యాంకును, ఖాతా రకాన్ని బట్టి మారుతుంది. ఉదాహరణకు, బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవింగ్స్ ఖాతాదారులకు ఒక ఆర్థిక సంవత్సరంలో 25 చెక్ లీఫ్‌లను ఉచితంగా అందిస్తుంది. అదనపు చెక్కులకు సేవా ఛార్జీలు వర్తిస్తాయి.

# గచ్చిబౌలిలో కూలిన ఏడంతస్తుల భవనం.. ఇద్దరి దుర్మరణం

## - అక్రమ కట్టడాలన్నీ కూల్చేస్తామన్న హైడ్రా కమిషనర్

**మొదటిపేజీ తరువాయి..** అప్పగించినట్లు ప్రాంతీయ అగ్నిమాపక అధికారి సుధాకర్ రావు తెలిపారు. శిథిలాల కింద మరెవరైనా చిక్కుకున్నారా అనే కోణంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. కేవలం 50 గజాల స్వల్ప విస్తీర్ణంలో ఎలాంటి అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా ఏడంతస్తులతో పాటు అదనంగా పెంట్‌హౌస్‌ను నిర్మించడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. గతంలోనే దీనిపై జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీ చేసినప్పటికీ, యజమాని క్షేత్రస్థాయి అధికారులకు ముడుపులు చెల్లించి పనులు కొనసాగించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ భవనం పక్కనే ఉన్న వైట్ ఫీల్డ్ అపార్ట్‌మెంట్‌పైకి ఒరిగి కూలిపోవడంతో ఆ కట్టడం కూడా పాక్షికంగా దెబ్బతింది. గతంలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని, రెండేళ్ల క్రితం కూడా ఇదే ప్రాంతంలో ఓ ఐదంతస్తుల భవనం ఇలాగే ప్రమాదకరంగా ఒరిగిపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఘటనా స్థలాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. బిల్డర్ సాజిద్ నాసిరకంగా భవనాలు నిర్మిస్తున్నారని స్థానికులు పేర్కొన్న విషయాన్ని ప్రస్తావిస్తూ, నిబంధనలు ఉల్లంఘించిన అక్రమ కట్టడాలన్నింటినీ నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తామని హెచ్చరించారు. అంజయ్య నగర్ ప్రాంతంలో కనీస సెట్‌బ్యాక్‌లు పాటించకుండా, నాలాలను ఆక్రమించి నిర్మించిన బహుళ అంతస్తుల భవనాలు (హాస్టళ్లు) అనేకం ఉన్నాయని ఆయన తెలిపారు. ప్రమాదకరంగా ఉన్న ఆయా భవనాలను యజమానులు వెంటనే ఖాళీ చేయాలని ఆదేశిస్తూ, త్వరలోనే ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అక్రమ నిర్మాణాలన్నింటినీ నేలమట్టం చేస్తామని స్పష్టం చేశారు.

# బీజేపీ కొత్త టీమ్‌తో ప్రధాని మోదీ భేటీ

**మొదటిపేజీ తరువాయి..** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో బీజేపీ నూతన జాతీయ పదాధికారులతో సమావేశమయ్యారు. కొత్త ఆలోచనలు, దృక్పథాలతో పార్టీని మరింత బలోపేతం చేయాలని, ప్రజలతో పార్టీకి ఉన్న సంబంధాలను మరింతగా పెంచుకోవాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. సంస్థాగత సమావేశాలు ఇలాంటి కొత్త ఆలోచనలకు వేదికగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. సమావేశం అనంతరం ప్రధాని మోదీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో ఫొటోలను పంచుకున్నారు. "సంస్థాగత సమావేశాలు పార్టీని బలోపేతం చేయడానికి, ప్రజలతో సంబంధాలు పెంచుకోవడానికి కొత్త ఆలోచనలను అందిస్తాయి. కొత్త బృందంతో సమావేశం అద్భుతంగా జరిగింది," అని ఆయన పేర్కొన్నారు. పార్టీ కార్యాలయానికి విచ్చేసిన ప్రధానికి బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్ స్వాగతం పలికారు. ఈ వారం మొదట్లో ప్రకటించిన నితిన్ నబిన్ కొత్త జాతీయ బృందంతో ప్రధాని మోదీ భేటీ కావడం ఇదే తొలిసారి. ఈ కొత్తగా నియమించిన 65 మంది సభ్యుల బృందంలో 51 మంది కొత్త ముఖాలకు అవకాశం కల్పించడం గమనార్హం. రాబోయే రోజుల్లో చేపట్టబోయే పలు సంస్థాగత, ప్రజా సంబంధ కార్యక్రమాలపై ఈ సమావేశంలో చర్చించారు. ముఖ్యంగా యువతతో మమేకం కావడమే లక్ష్యంగా 'యువ సంవాద్' (యువతతో సంప్రదింపులు) కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. 14 ఏళ్లు పైబడిన యువతను లక్ష్యంగా చేసుకుని ప్రత్యేక కార్యక్రమాలు రూపొందిస్తున్నారు. ఈ కార్యక్రమాల సమన్వయ బాధ్యతను భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం)కు అప్పగించారు. అలాగే, రాబోయే ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలకు పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంపై కూడా దృష్టి సారించారు. దీనిపై సమీక్షించేందుకు ఆదివారం పార్టీ అధ్యక్షుడు నితిన్ నబిన్.. రాష్ట్రాల బీజేపీ అధ్యక్షులు, సంస్థాగత ప్రధాన కార్యదర్శులు, రాష్ట్రాల ఇన్‌ఛార్జ్‌లతో మరో సమావేశం నిర్వహించనున్నారు.

# రూ.7,000 కోట్లతో కొత్త ఎల్‌పీజీ పైప్‌లైన్లు..

**మొదటిపేజీ తరువాయి..** దేశంలో ఎల్‌పీజీ సరఫరా వ్యవస్థను మరింత పటిష్ఠం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సుమారు రూ. 7,000 కోట్ల వ్యయంతో ఎల్‌పీజీ పైప్‌లైన్ నెట్‌వర్క్‌ను భారీగా విస్తరించేందుకు పెట్రోలియం, సహజ వాయువు నియంత్రణ మండలి (పీఎన్‌జీఆర్‌బీ) ఆమోదం తెలిపింది. ఈ బృహత్తర ప్రాజెక్టు ద్వారా తెలంగాణ రాష్ట్రానికి గణనీయమైన లబ్ధి చేకూరనుంది. ప్రభుత్వ రంగ సంస్థ గెయిల్ (ఇండియా) లిమిటెడ్ ఆధ్వర్యంలో సుమారు 1,800 కిలోమీటర్ల మేర కొత్త పైప్‌లైన్లను నిర్మించనున్నారు. ఇందులో భాగంగా తెలంగాణలోని చర్లపల్లి నుంచి మహారాష్ట్రలోని నాగ్‌పూర్ వరకు 556 కిలోమీటర్ల పొడవైన పైప్‌లైన్‌ను ఏర్పాటు చేయనున్నారు. దీనితో పాటు ఉత్తరప్రదేశ్ లోని ఝాన్సీ నుంచి ఉత్తరాఖండ్‌లోని సితార్‌గంజ్ వరకు (611 కి.మీ.), మహారాష్ట్రలోని శిక్రాపూర్ నుంచి కర్ణాటక, గోవాలోని హుబ్లీ వరకు (633 కి.మీ.) మరో రెండు ప్రధాన మార్గాలను కూడా నిర్మించనున్నారు. ఈ పైప్‌లైన్లు తెలంగాణ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, కర్ణాటక, గోవా రాష్ట్రాల గుండా వెళతాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే దేశంలోని మొత్తం ఎల్‌పీజీ పైప్‌లైన్ నెట్‌వర్క్ ప్రస్తుతం ఉన్న 7,700 కిలోమీటర్ల నుంచి 9,500 కిలోమీటర్లకు విస్తరిస్తుంది. పైప్‌లైన్ల ద్వారా గ్యాస్ సరఫరాను పెంచడం వల్ల రవాణా ఖర్చులు తగ్గడమే కాకుండా, రహదారులపై ట్రాఫిక్ రద్దీ, ప్రమాదాల ముప్పు కూడా గణనీయంగా తగ్గుతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

# జేడీ వాన్స్, జొహ్రాన్ మమ్దానీలతో భేటీకి రేవంత్ ప్లాన్?

## - కేంద్రం అందుకే అనుమతి నిరాకరించిందా?



**మొదటిపేజీ తరువాయి..** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపాదిత అమెరికా పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించిన విషయం తెలిసిందే. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, న్యూయార్క్ మేయర్ జొహ్రాన్ మమ్దానీలతో భేటీలు కూడా ఆయన పర్యటనలో భాగంగా ఉండటమే ఇందుకు కారణంగా కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపినట్లు ఎన్డీటీవీ పేర్కొంది. అమెరికా, బ్రిటన్ పర్యటనలకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కార్యాలయం విదేశాంగ మంత్రిత్వ శాఖ నుంచి అనుమతి కోరింది. బ్రిటన్ పర్యటనకు అంగీకరించిన కేంద్రం అమెరికా టూర్‌కు మాత్రం అనుమతి నిరాకరించింది. అమెరికా పర్యటనలో జేడీ వాన్స్, జొహ్రాన్ మమ్దానీలతో భేటీలను ప్రతిపాదించినప్పటికీ.. ఈ కార్యక్రమాలను విదేశాంగ శాఖతో చర్చించలేదని, రాజకీయ అనుమతి ప్రక్రియలో భాగంగా సమాచారం పంపలేదని కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. విదేశీ పర్యటనలకు అనుమతి ఇచ్చే ముందు ముఖ్యమంత్రి వంటి ప్రజాప్రతినిధుల ప్రతిపాదిత కార్యక్రమాలను విదేశాంగ శాఖ పరిశీలిస్తుంది. పదవికి, పర్యటన ఉద్దేశానికి అనుగుణంగా కార్యక్రమాలు ఉన్నాయా? అన్నది పరిశీలించిన తర్వాతే అనుమతి ఇస్తుంది. ఈ అంశంపై శుక్రవారం విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందించారు. రేవంత్‌రెడ్డి బ్రిటన్ పర్యటనకు అనుమతి ఇచ్చామని, అమెరికా పర్యటనకు మాత్రం అనుమతి ఇవ్వలేదని తెలిపారు. ముఖ్యమంత్రులు, ఇతర ప్రముఖుల విదేశీ పర్యటనలు కొన్ని ప్రమాణాలకు తగినవిగా ఉండాలని స్పష్టం చేశారు. అమెరికా పర్యటన విషయంలో ఆ ప్రమాణాలు సరిపోలకపోవడంతో అనుమతి నిరాకరించినట్లు వెల్లడించారు. అమెరికాలో తెలుగు ప్రజల సంఖ్య భారీగా ఉండటంతో రేవంత్‌రెడ్డి పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది. అమెరికాలోని భారతీయ అమెరికన్లలో తెలుగు సమాజం సుమారు 14 శాతం ఉంటుందని, 12 లక్షలకు పైగా తెలుగు ప్రజలు అక్కడ ఉన్నారని సమాచారం. అయితే ఈ వ్యవహారం తెలంగాణలో రాజకీయ వివాదానికి దారితీసింది. అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించి, బ్రిటన్ పర్యటనకు అనుమతి ఇవ్వడంపై ప్రశ్నలు తలెత్తాయి. అయితే కేంద్ర ప్రభుత్వ వర్గాలు మాత్రం ఈ నిర్ణయం రాజకీయ కక్షతో తీసుకున్నది కాదని, కేవలం సాంకేతిక అంశాల ఆధారంగానే అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించినట్లు చెబుతున్నాయి.

# తీవ్ర గాయాలతో చేతులు కోల్పోయిన వారికి పునర్జన్మ




**హైదరాబాద్, ఆగస్టు 22, నేటి శుభోదయ :** తీవ్రమైన చేతి గాయాలతో అవయవాలు కోల్పోయిన వారికి అధునాతన మైక్రో సర్జరీలతో కదలిక, స్వతంత్ర జీవనం, ఆత్మవిశ్వాసాన్ని పునరుద్ధరించిన అపోలో ఆస్పత్రుల వైద్య బృందం.. వరల్డ్ హ్యాండ్ సర్జరీ డే సందర్భంగా బాధితులను సత్కరించింది. జూబ్లీహిల్స్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో చేతి శస్త్రచికిత్సల ద్వారా కోలుకున్న బాధితులు, వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.కార్యక్రమానికి ఫ్యూచర్ సిటీ ట్రాఫిక్ డీసీపీ శ్రీ శివం ఉపాధ్యాయ ముఖ్య అతిథిగా హాజరై చేతి శస్త్రచికిత్సల నుంచి కోలుకున్న బాధితులను సత్కరించారు. తీవ్ర గాయాలను అధిగమించి తిరిగి కదలికను పొందిన వారి ధైర్యం, పట్టుదలను ఆయన అభినందించారు.అపోలో ఆస్పత్రుల కన్సల్టెంట్ హ్యాండ్, రిస్ట్ అండ్ మైక్రో సర్జన్ డాక్టర్ గోపీనాథ్ బండారి మాట్లాడుతూ చేతి తెగిపోవడం వంటి ఘటనల్లో తిరిగి అతికించే శస్త్రచికిత్స (రీప్లాంటేషన్) చేయడానికి సమయం అత్యంత కీలకమన్నారు. నిపుణులైన వైద్య బృందం, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, వివిధ విభాగాల మధ్య సమన్వయంతో చికిత్స అందించాల్సి ఉంటుందని తెలిపారు. ఇలాంటి శస్త్రచికిత్సల ద్వారా చేతి ఆకృతితో పాటు కదలిక, స్పర్శ, పనితీరును కూడా పునరుద్ధరించవచ్చన్నారు. చేతిని కాపాడటమే కాకుండా బాధితుడు తిరిగి సాధారణ జీవితం సాగించేలా చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.కన్సల్టెంట్ హ్యాండ్, రిస్ట్ అండ్ మైక్రోసర్జన్ డాక్టర్ బండి సాహిత్య మాట్లాడుతూ మైక్రోసర్జికల్ రీప్లాంటేషన్‌లో అత్యంత కచ్చితత్వం, నైపుణ్యం, వేగం అవసరమన్నారు. ఇలాంటి కేసుల్లో ప్రతి నిమిషం కీలకమేనని, అత్యుత్తమ ఫలితాల కోసం నిపుణుల బృందం, ఆధునిక సాంకేతికత, సమన్వయంతో కూడిన చికిత్స అవసరమని వివరించారు.అపోలో ఆస్పత్రుల తెలుగు రాష్ట్రాల సీఈవో మిస్టర్ తేజస్వి రావు వీరేపల్లి మాట్లాడుతూ ప్రతి హ్యాండ్ సర్జరీ బాధితుడి ప్రయాణం ధైర్యం, పట్టుదల, ఆశకు ప్రతీక అన్నారు. అధునాతన వైద్య సాంకేతికతను వైద్య నిపుణుల అనుభవంతో సమన్వయం చేసి బాధితులు తమ సాధారణ జీవితాల్లోకి తిరిగి వచ్చేలా చేయడం అపోలో ఆస్పత్రుల లక్ష్యమని తెలిపారు. సకాలంలో ప్రత్యేక వైద్యం అందిస్తే తీవ్ర గాయాల నుంచి కూడా జీవితాలను మార్చే ఫలితాలు సాధ్యమవుతాయని అన్నారు.ఈ సందర్భంగా ఓ బాధితుడు తన అనుభవాన్ని పంచుకుంటూ ప్రమాదంలో మోచేయి స్థాయిలో చేయి తెగిపోవడంతో అపోలో ఆస్పత్రిలో క్లిష్టమైన రీప్లాంటేషన్ శస్త్రచికిత్స చేయించుకున్నానని తెలిపారు. చికిత్స అనంతరం క్రమంగా చేతిలో కదలిక, పనితీరు తిరిగి పొందానని చెప్పారు.తీవ్ర చేతి గాయాల్లో సత్వర వైద్యం, మైక్రోసర్జరీ నైపుణ్యం, అధునాతన సాంకేతికత ఎంత కీలకమో ఈ కార్యక్రమం చాటిచెప్పింది. కోలుకున్న బాధితుల విజయగాథలు ఇలాంటి గాయాలతో బాధపడుతున్న వారికి కొత్త ఆశను కల్పించాయి.

# ధర్పల్లిలో మంగళవారం బీసీ, ఎస్సీ, ఎస్టీ సర్వసభ సమావేశం



**నిజామాబాద్ రూరల్, ఆగస్టు 22, నేటి శుభోదయ :** ధర్పల్లి మండల కేంద్రంలో తేదీ25–08–2026 మంగళవారం రోజున బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల ముఖ్యమైన సర్వసబ్య సమావేశం నిర్వహించనున్నట్లు స్థానిక నాయకులు తెలిపారు. ఈ సమావేశానికి మేధావులు, విద్యావంతులు, బి సీ, ఎస్సి, ఎస్టీ , సంఘాల నాయకులు పాల్గొని బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల హక్కులు, ఎదుర్కొంటున్న సమస్యలు మరియు సంక్షేమ పథకాలపై చర్చించేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని ఈ వర్గాలకు చెందిన ప్రజలు, యువకులు, మహిళలు మరియు ప్రజా సంఘాల నాయకులు పెద్ద ఎత్తున హాజరై ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో సంబెటి సుమన్‌కరికేల్లి మహిపాల్‌చలిమెల నర్సయ్యవి బాలయ్యరఘురాం మచ్చమంచి కంటి ప్రశాంత్, లు ఉన్నారు

# డివైఎఫ్ఐ జిల్లా నాలుగో మహాసభలను జయప్రదం చేయండి

**- సదాశివపేటలో గోడపత్రిక ఆవిష్కరణ —— జిల్లా కార్యదర్శి టి. అనిల్**




**సంగారెడ్డి, ఆగస్టు 22, నేటి శుభోదయ :** డివైఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా నాలుగో మహాసభలను జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి. అనిల్ పిలుపునిచ్చారు. శనివారం సదాశివపేట పట్టణంలోని డివైఎఫ్ఐ కార్యాలయం ఎదుట జిల్లా నాలుగో మహాసభలకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి అనిల్ మాట్లాడుతూ, సంగారెడ్డి జిల్లాలో విద్యార్థి, యువజన సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తూ, వారి హక్కుల కోసం డివైఎఫ్ఐ నిరంతరం ముందుండి ఉద్యమిస్తోందని అన్నారు. జిల్లాలోని యువతీ యువకులకు స్థానిక పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించినట్లు తెలిపారు.యువతకు ఉద్యోగాలు కల్పించకుండా, ఖాళీలను భర్తీ చేయకుండా కాలయాపన చేస్తే ప్రభుత్వాలను ప్రశ్నించే పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. విద్య, వైద్యం, ఉపాధి వంటి మౌలిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా డివైఎఫ్ఐ ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు.రాబోయే కాలంలో విద్యార్థి, యువజన సమస్యలపై చేపట్టాల్సిన పోరాటాలకు కార్యాచరణ రూపొందించేందుకు సెప్టెంబర్ 6, 7 తేదీల్లో కొండాపూర్‌లో డివైఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా నాలుగో మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని యువతీ యువకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ నాయకులు ఎం. శ్రీకాంత్, నవీన్, కృష్ణ, ఫెరోజ్ తదితరులు పాల్గొన్నారు.

# జీనియస్ స్కూల్ లో "GREEN FESTA"



**సంగారెడ్డి, ఆగస్టు 22, నేటి శుభోదయ :** ఈరోజు జీనియస్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ లో గ్రీన్ డే నిర్వహించారు విద్యార్థులు గ్రీన్ డే సందర్భంగా ఆకుపచ్చ రంగు లోవస్త్రధారణ మరియు వివిధ రకమైన ఆకృతులను ఆకు పచ్చని రంగులో తయారు చేశారు గ్రీన్ డే సందర్భంగా పాఠశాల ఆవరణలో "వన మహోత్సవం" నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల అభివృద్ధి అధికారి శ్రీమతి అంజనీ దేవి APO శ్రీనివాస్ , CC శేఖర్, మెలిగిరిపేట సర్పంచ్ షాబుద్దీన్ పాల్గొన్నారు MPDO అంజనీ దేవి మాట్లాడుతూ పాఠశాలలో ప్రకృతి పై ప్రేమను అవగాహనను పెంచడానికి గ్రీన్ డే నిర్వహించినందుకు జీనియస్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ యాజమాన్యాన్ని అభినందించారు ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శ్రీమతి ముద్ద శశికళ నాగనాథ్, వైస్ చైర్మన్ కూచి శ్రీనివాస్ సెక్రటరీ పోల వెంకటేశం కరెస్పాండెంట్ రఘు వర్ధన్ రెడ్డి డైరెక్టర్ అమరేందర్ రెడ్డి ప్రిన్సిపాల్ ప్రీతి వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు

# భూ దోపిడీకి కాంగ్రెస్ ప్రభుత్వ యత్నం

**- మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్**

- **నిషేధిత భూములు కోటి ఎకరాలకు ఎలా పెరిగాయి?**
- **రైతు రుణమాఫీపై తుమ్మల చర్చకు రావాలి**
- **పొంగులేటి క్షమాపణ చెప్పి తప్పించుకోలేరు**




**ఖమ్మం, ఆగస్టు 22, నేటి శుభోదయ :** ప్రజల ఆస్తులను కొల్లగొట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, కాంగ్రెస్ పార్టీ అంటేనే కబ్జాలు అనే పరిస్థితి నెలకొన్నదని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఎద్దేవా చేశారు. శనివారం ఖమ్మం నగరంలో బీఆర్ఎస్ ఆత్మీయ సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ప్రజల ఆస్తులను పరిరక్షించాల్సిన బాధ్యత కలిగిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని క్షమాపణలు చెప్పినంత మాత్రాన ప్రజలు ఈ చర్యలను ఎలా సహిస్తారని ప్రశ్నించారు. ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ భూభారతి పేరుతో దోపిడీకి పాల్పడేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్షమాపణలు చెప్పి బాధ్యత నుంచి తప్పించుకోవాలని చూస్తున్నారని 22 ఏ నిషేధిత భూముల విషయంలో గతంలో 8, 9 లక్షల ఎకరాలుగా ఉన్న భూములు ఇప్పుడు కోటి ఎకరాలకు ఎలా చేరుకున్నాయో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.రైతు రుణమాఫీ వంద శాతం పూర్తయిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెబుతున్నారని, అది నిజమని నిరూపించేందుకు ఏ గ్రామానికైనా వచ్చి రైతు రుణమాఫీపై బహిరంగ చర్చకు సిద్ధం కావాలని సవాల్ విసిరారు. తన అంతు చూస్తానని మంత్రి వ్యాఖ్యలు చేస్తున్నారని, అయితే ముందుగా ప్రజల సమస్యలను పట్టించుకునే పరిస్థితిలో ప్రభుత్వం ఉందా అని ప్రశ్నించారు.ఖమ్మం జిల్లాలో ఎల్ నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో నీటి కొరత, సంక్షోభం ఏర్పడే ప్రమాదం ఉన్నప్పటికీ కనీసం ముగ్గురు మంత్రులు ఈ అంశంపై దృష్టి సారించడం లేదని విమర్శించారు. సీతారామ ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని ఆరోపించారు. రాజీవ్ సాగర్ నిర్మాణం పూర్తయిన ఏడాదికే లైనింగ్ కూలిపోయిందని, దీనిపై ప్రభుత్వం బాధ్యత వహించి ప్రజలకు సమాధానం చెప్పాలని ఇది కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో అలవికాని హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో నెరవేర్చలేదని మండిపడ్డారు. పేదల ఇళ్లను కూల్చివేస్తూ ప్రభుత్వం పెడబొబ్బలు పెడుతోందని, పేదలను ఆదుకునేందుకు కృషి చేయకుండా వారి పొట్ట కొడుతోందని విమర్శించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో తాను మంత్రిగా ఉన్న సమయంలో 23 ఎకరాల్లో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి, కేబినెట్ ఆమోదంతో జీవో జారీ చేయించానని పువ్వాడ అజయ్ కుమార్ తెలిపారు. అయితే జర్నలిస్టుల సంక్షేమం కోసం కనీస చర్యలు కూడా చేపట్టకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వారిని మోసం చేస్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన విలువైన ఇళ్ల స్థలాలను జర్నలిస్టులకు కేటాయించడంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.ప్రజల ఆస్తులు, రైతుల సమస్యలు, పేదల ఇళ్లు, జర్నలిస్టుల సంక్షేమం వంటి అంశాలపై ప్రభుత్వం తక్షణమే స్పష్టమైన సమాధానం ఇవ్వాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ డిమాండ్ చేశారు.

# 18వ వార్డులో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులకు హామీ 18 వ వార్డు కౌన్సిలర్ బిట్ల నిఖిత ప్రేమ్ కుమార్





**సంగారెడ్డి, ఆగస్టు 22, నేటి శుభోదయ :** సదాశివపేట 18వ వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ మరియు రోడ్డు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ 18వ వార్డు కౌన్సిలర్ బిట్ల నిఖిత ప్రేమ్ మున్సిపల్ కమిషనర్ మరియు మున్సిపల్ చైర్‌పర్సన్ కి వినతి పత్రం సమర్పించారు.వార్డులోని ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మున్సిపల్ సాధారణ నిధుల నుండి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేయడంతో పాటు సీసీ రోడ్డు నిర్మించాలని కౌన్సిలర్ కోరారు.ఈ విషయంపై మున్సిపల్ చైర్‌పర్సన్ మరియు మున్సిపల్ కమిషనర్ సానుకూలంగా స్పందించి, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సంబంధిత పనులను పరిశీలించి త్వరలోనే పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ, 18వ వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని, ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే వరకు ప్రయత్నం కొనసాగిస్తామని తెలిపారు.

# సాంఘిక సంక్షేమ బాలుర గురుకులాల స్పాట్ కౌన్సిలింగ్



**ఖమ్మం, ఆగస్టు 22, నేటి శుభోదయ :** భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా మహిళా మోర్చా జిల్లా కమిటీని శుక్రవారం ఏర్పాటు చేయడం జరిగింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు నారప రాజు రామచంద్ర రావు ఆదేశాల మేరకు మహిళ మోర్చా రాష్ట్రా అధ్యక్షురాలు శిల్ప రెడ్డి ఆదేశాల మేరకు బీజేపీ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు సహకారం తో జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు మంద సరస్వతి ఆధ్వర్యంలో నూతన జిల్లా కమిటీని ప్రకటించారు.మహిళల సమస్యలపై నిరంతరం పోరాడుతూ, కేంద్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతి కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, పార్టీ బలోపేతానికి మహిళా మోర్చా కార్యకర్తలు కృషి చేయాలని మంద సరస్వతి తెలిపారు.నూతన కమిటీలో ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, కోశాధికారి, కార్యాలయ కార్యదర్శి, అధికార ప్రతినిధి, సోషల్ మీడియా కన్వీనర్ మరియు కో-కన్వీనర్, మన్ కీ బాత్ కన్వీనర్, కో-కన్వీనర్, కార్యవర్గ సభ్యులు కలిపి మొత్తం 23 మంది సభ్యులకు బాధ్యతలు అప్పగించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు మంద సరస్వతి మాట్లాడుతూ "బీజేపీ మహిళా మోర్చాను ఖమ్మం జిల్లాలో మరింత బలోపేతం చేసి, ప్రతి మహిళకు పార్టీ సిద్ధాంతాలను మరియు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను చేరువ చేస్తాం. మహిళల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తాం. నూతన కమిటీ సభ్యులందరూ సమన్వయంతో పనిచేసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి" అని అన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిటీ సభ్యులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. మహిళా మోర్చా నాయకులు, కార్యకర్తలు, బీజేపీ శ్రేణులు నూతన కమిటీకి అభినందనలు తెలియజేశారు.

# రఘునాధపాలెం మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం

- ఇద్దరు అక్కడికక్కడే మృతి
- శివాయిగూడెంలో విషాద ఛాయలు





**ఖమ్మం, ఆగస్టు 22, నేటి శుభోదయ :** ఖమ్మం-ఇల్లందు ప్రధాన రహదారిపై రఘునాధపాలెం మండలం జింకల తండా క్రాస్ రోడ్, తహసీల్దార్ కార్యాలయం సమీపంలో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు.వివరాల ప్రకారం.. శివాయిగూడెం గ్రామానికి చెందిన గార్లపాటి రిషిక (10), ఆమె బంధువు గుడ్డేటి శ్రీను (18) ద్విచక్ర వాహనంపై ఖమ్మం నుంచి తమ స్వగ్రామమైన శివాయిగూడెం వైపు వెళ్తున్నారు. అదే సమయంలో హైదరాబాద్ వైపు వెళ్తున్న ఓ కారు వారి ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టడంతో ఈ ఘోర ప్రమాదం జరిగింది.కారు ఢీకొట్టిన తీవ్రతకు ద్విచక్ర వాహనంపై ఉన్న రిషిక, శ్రీను తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. ఈ విషాద ఘటనతో శివాయిగూడెం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుల కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు స్థానికులను కలచివేశాయి చిన్న వయసులోనే ఇద్దరు ప్రాణాలు కోల్పోవడం గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది.

## సదాశివపేట కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం



**సంగారెడ్డి, ఆగస్టు 23, నేటి శుభోదయ :** కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సదాశివపేట కాంగ్రెస్ పార్టీ మరియు మున్సిపాలిటీ వ్యవహారాల ఇంచార్జ్ తోపాజి అనంత కిషన్ గారు రావడం జరిగింది కార్యకర్తలు నాయకులు దిశా నిర్దేశం చేయడం జరిగింది సీఎం ప్రోగ్రాం సక్సెస్ కావడం పై హర్షం వ్యక్తం చేయడం జరిగింది కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించి వారితో మాట్లాడడం జరిగింది కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున సదాశివపేట డెవలప్మెంట్ కు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మరియు కార్యకర్తల ఇబ్బందిని జగ్గారెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కారం చేస్తామని తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో CDC చైర్మన్ రామ్ రెడ్డి మున్సిపల్ చైర్మన్ అంజమ్మ సత్యనారాయణ వైస్ చైర్మన్ రేణుక చిరంజీవి బ్లాక్ ప్రెసిడెంట్ సిద్దన్న పట్టణ అధ్యక్షులు నాగరాజు ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు శ్రీహరి సేవాదళ్ జిల్లా అధ్యక్షులు ప్రదీప్ గారు మరియు మాజీ వైస్ చైర్మన్ విశ్వనాథం బీసీ స్టేట్ డైరెక్టర్ పట్నం సుభాష్ జిల్లా జనరల్ సెక్రటరీ అరుణ్ కౌన్సిలర్లు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది

# ఖమ్మం ప్రెస్ క్లబ్ లో ఘనంగా కలం యోధుడు షయాద్ సోయాబుల్లాఖాన్ 78వ వర్ధంతి వేడుకలు

### టిడబ్ల్యూజేఎఫ్ హెచ్2843 వ్యవస్థాపకులు మామిడి సోమయ్య యూనియన్, ఖమ్మం జిల్లా అధ్యక్షులు నానబాల రామకృష్ణ, కార్యదర్శి అర్వపల్లి నగేష్

### అసమాన కలం యోధుడు షహీద్ షోయబుల్లా ఖాన్

**ఖమ్మం, ఆగస్టు 22, నేటి శుభోదయ :** నిరంకుశత్వంపై అక్షరాన్నే ఆయుధంగా మలిచి, నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన అసమాన కలం యోధుడు షహీద్ షోయబుల్లా ఖాన్. హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేయాలని, ప్రజాస్వామ్య పాలన రావాలని కోరుతూ తన రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిన ధీర జర్నలిస్టుగా ఆయన చరిత్రలో నిలిచి పోయారు. షోయబుల్లా ఖాన్ 1920 అక్టోబర్ 17న ఖమ్మం జిల్లాలోని సుబ్లేడు గ్రామంలో హబీబుల్లా ఖాన్, లాయహున్నిసా బేగం దంపతులకు జన్మించారు. ఆయన తండ్రి హబీబుల్లా ఖాన్ రైల్వే శాఖ లో పనిచేసేవారు. మహాత్మా గాంధీకి ఆయన వీరాభిమాని. గాంధీజీ పట్ల ఉన్న అభిమానంతో తన కుమారుడిని ప్రేమగా 'షోయబుల్లా గాంధీ' అని పిలిచేవారని చారిత్రక కథనాలు పేర్కొంటున్నాయి. బాల్యం నుంచే షోయబుల్లా ఖాన్ కు సమాజం పట్ల అవగాహన పెరిగింది. బొంబాయిలో ఇంటర్మీడియట్ వరకు చదువుకున్న ఆయన హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బీ.ఏ తో పాటు జర్నలిజం విద్యను అభ్యసించారు. మంచి ఉద్యోగం పొందే అవకాశాలు ఉన్నప్పటికీ నిరంకుశ పాలనను ప్రశ్నించేందుకు జర్నలిజాన్ని తన వృత్తిగా ఎంచుకున్నారు. జాతీయ భావాలను ప్రోత్సహిస్తున్న 'తేజ్' ఉర్దూ వారపత్రికలో సబ్‌ఎడిటర్‌గా చేరిన షోయబుల్లా ఖాన్ నిజాం పాలకులు, వారి అనుచరులైన భూస్వాములు, రజాకారులు ప్రజలపై సాగిస్తున్న దురాగతాలను తన రచనల ద్వారా ఎండగట్టారు. ఆయన రచనలు నిజాం పాలకులకు ఆగ్రహం తెప్పించడంతో 'తేజ్' పత్రిక నిషేధానికి గురైంది. ఆ తర్వాత మందుముల నరసింగరావు ఆధ్వర్యంలో నడిచిన 'రయ్యత్' ఉర్దూ పత్రికలో చేరి తన కలానికి మరింత పదును పెట్టారు. బెదిరింపు లేఖలు వచ్చినప్పటికీ ఆయన వెనక్కి తగ్గలేదు. చివరకు 'రయ్యత్' పత్రిక కూడా నిజాం ప్రభుత్వ ఆగ్రహానికి గురై మూతపడింది. అయినప్పటికీ ప్రజల తరపున తన పోరాటాన్ని కొనసాగించాలని షోయబుల్లా ఖాన్ నిర్ణయించుకున్నారు.

**'ఇమ్రోజ్' పత్రిక స్థాపన**

స్వయంగా జాతీయ భావాలతో కూడిన పత్రికను ప్రారంభించాలని నిర్ణయించుకున్న, షోయబుల్లా ఖాన్ తన తల్లి, భార్య నగలను విక్రయించి వచ్చిన డబ్బుతో, బూర్గుల రామకృష్ణారావు ఇంటిని అద్దెకు తీసుకుని 'ఇమ్రోజ్' అనే ఉర్దూ దినపత్రికను ప్రారంభించారు. 1947 నవంబర్ 15న 'ఇమ్రోజ్' తొలి సంచిక వెలువడింది. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా పత్రికను ప్రజల గొంతుకగా తీర్చిదిద్దారు. నిజాం నిరంకుశత్వం, రజాకారుల మతదురహంకారం, ప్రజలపై జరుగుతున్న దాడులను ఆయన తన సంపాదకీయాలు, కథనాల ద్వారా తీవ్రంగా విమర్శించారు. దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేయడానికి నిజాం నిరాకరించాడు. ఈ పరిస్థితుల్లో హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కావాలని షోయబుల్లా ఖాన్ 'ఇమ్రోజ్' ద్వారా బలంగా డిమాండ్ చేశారు. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా హైదరాబాద్ భారత యూనియన్‌లో విలీనం కావాల్సిన అవసరాన్ని వివరిస్తూ, ఆయన అనేక సంపాదకీయాలు రాశారు. హైదరాబాద్ ప్రజల్లో ఎక్కువమంది ఉర్దూ చదువుకున్నవారు కావడంతో 'ఇమ్రోజ్' రచనలు ప్రజలు, మేధావులపై గణనీయమైన ప్రభావం చూపాయి. 1948 జనవరి 29న 'ఇమ్రోజ్'లో ప్రచురించిన 'పగటి ప్రభుత్వం-రాత్రి ప్రభుత్వం' అనే సంపాదకీయం షోయబుల్లా ఖాన్ ధైర్యసాహసాలకు నిదర్శనంగా నిలిచింది. ఆయన రచనలు నిజాం ప్రభుత్వానికి, రజాకారులకు తీవ్ర ఆగ్రహాన్ని కలిగించాయి.

**ఖాసిం రజ్వీ బెదిరింపులు**

షోయబుల్లా ఖాన్ పై రజాకార్ల నాయకుడు ఖాసిం రజ్వీ నుంచి బెదిరింపులు వచ్చాయి. అయినప్పటికీ ఆయన తన రచనా పోరాటాన్ని ఆపలేదు. అన్యాయం ఎక్కడ జరిగినా అక్కడికి వెళ్లి వాస్తవాలను వెలుగులోకి తెచ్చారు. 1948 ఆగస్టు 19న నిజాం వ్యతిరేకంగా వార్తలు, వ్యాసాలు రాస్తే చేతులు నరికేస్తామని, ఖాసిం రజ్వీ బహిరంగంగా హెచ్చరించినట్లు, చారిత్రక కథనాలు పేర్కొంటున్నాయి.



అయితే షోయబుల్లా ఖాన్ మాత్రం వెనక్కి తగ్గలేదు. సత్యం కోసం పోరాడుతూ ప్రాణాలు కోల్పోవడం కూడా గర్వించదగ్గ విషయమేనని ఆయన ధైర్యంగా ప్రకటించారు.

**ఆగస్టు 21 అర్ధరాత్రి దారుణ దాడి**

1948 ఆగస్టు 21 అర్ధరాత్రి కాచిగూడ ప్రాంతంలోని 'ఇమ్రోజ్' కార్యాలయంలో పని ముగించుకుని షోయబుల్లా ఖాన్ తన బావమరిది ఇస్మాయిల్ ఖాన్‌తో కలిసి ఇంటికి బయలుదేరారు. చప్పల్ బజార్ ప్రాంతానికి చేరుకున్న సమయంలో సాయుధ దుండగులు వారిపై దాడి చేశారు. షోయబుల్లా ఖాన్‌పై కాల్పులు జరిపి తీవ్రంగా గాయపరిచారు. అనంతరం ఆయన చేతులను దారుణంగా నరికారు. దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఆయన బావమరిది ఇస్మాయిల్ ఖాన్ కూడా తీవ్రంగా గాయపడ్డారు. కాల్పుల శబ్దాలు విని స్థానిక ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడంతో దుండగులు అక్కడి నుంచి పారిపోయారు. తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో ఉన్న షోయబుల్లా ఖాన్‌ను ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

**దేశం కోసం మరణిస్తున్నానని గర్వంగా చెప్పిన షోయబుల్లా**

ఆగస్టు 22 తెల్లవారుజామున షోయబుల్లా ఖాన్ స్పృహలోకి వచ్చారు. తన చివరి క్షణాల్లో కూడా ఆయన ధైర్యాన్ని కోల్పోలేదు. మరణం అనివార్యమని, మంచి లక్ష్యం కోసం ప్రాణాలు అర్పించడం గర్వించదగ్గ విషయమని తన తల్లిదండ్రులకు, భార్యకు ధైర్యం చెప్పినట్లు చారిత్రక కథనాలు పేర్కొంటున్నాయి. నిజాం నిరంకుశత్వాన్ని తన కలంతో సవాలు చేసిన షోయబుల్లా ఖాన్ 28 ఏళ్ల వయసులోనే 1948 ఆగస్టు 22న తుదిశ్వాస విడిచారు. షోయబుల్లా ఖాన్ తన మతానికి చెందిన నిజాం పాలకుడే అయినప్పటికీ నిరంకుశ పాలనను సమర్థించలేదు. రజాకారులు తన మతస్తులే అయినప్పటికీ వారి దారుణాలను ఖండించడంలో వెనుకాడలేదు. మతం పేరుతో జరిగే మతోన్మాదాన్ని ఆయన వ్యతిరేకించారు.
హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కావాలని, మతమౌఢ్యం లేని ప్రజాస్వామ్య పాలన ఏర్పడాలని ఆయన కలలు కన్నారు. ఆ లక్ష్యం కోసం నడిరోడ్డుపైనే తన ప్రాణాలను త్యాగం చేశారు. పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామిక విలువలు, లౌకిక భావాలు, ప్రజల హక్కుల కోసం తన కలాన్ని ఆయుధంగా మార్చుకున్న షోయబుల్లా ఖాన్ త్యాగం నేటి జర్నలిస్టులకు, ప్రజాస్వామ్యవాదులకు స్ఫూర్తిదాయకం. ఆగస్టు 22న ఆయన వర్ధంతి సందర్భంగా ఈ అసమాన కలం యోధుడి సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత.

**షోయబుల్లా ఖాన్ అమరత్వం ప్రజాస్వామ్య పోరాటానికి చిరస్మరణీయం.**

ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ హెచ్-2843 కోశాధికారి వేములకొండ రమేష్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ ఎలుగోటి వెంకట్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ నల్లా రాకేష్ రెడ్డి, టీబీజేఎ జిల్లా కార్యదర్శి కాసోజు శ్రీధర్, వీడియో గ్రాఫర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అమరబోయిన ఉపేందర్, టిడబ్ల్యూజేఎఫ్ నగర అధ్యక్షులు గంటేల కుమార్, కార్యదర్శి కప్పల మధు గౌడ్, ప్రెస్ కబ్ అధ్యక్షులు అంతోటి శ్రీనివాస్, కిరణ్ కుమార్, గుజ్జు గోపాలకృష్ణ, చిన్నంశెట్టి రాంబాబు, పాగా యోనా, మేకల రవి, మొగిలి నాగేశ్వరరావు, షేక్ మీరా, ఎలిశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కంపెనీలను తీసుకురావడం చేతకాకపోతే భూములను తిరిగి ఇవ్వాలి

**- ఎన్కతల మొబిలిటీ వ్యాలీ ప్రాంతంలో సబితా ఇంద్రారెడ్డి, మెతుకు ఆనంద్ డిమాండ్**

**వికారాబాద్, ఆగస్టు 22, నేటి శుభోదయ :** వికారాబాద్ జిల్లా ఎన్కతల గ్రామంలో 1,100 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయతలపెట్టిన మొబిలిటీ వ్యాలీ ప్రాంతాన్ని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు స్థానిక రైతులను కలసి, భూసేకరణ వల్ల వారు ఎదుర్కొంటున్న సమస్యలు, భయాందోళనలను నేరుగా అడిగి తెలుసుకున్నారు.గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనుల కోసం భూములు తీసుకున్న సమయంలో రైతులకు తగిన పరిహారం అందించి, వారికి పూర్తి న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్నామని మెతుకు ఆనంద్ స్పష్టం చేశారు. రైతుల భూములను అభివృద్ధి కోసం సేకరించినప్పుడు వారికి తగిన పరిహారంతో పాటు వారి కుటుంబాల భవిష్యత్తుకు భరోసా కల్పించాల్సిన గురుతర బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మొబిలిటీ వ్యాలీ ప్రాంతంలో పరిశ్రమలు, కంపెనీలను తీసుకువచ్చి స్థానిక రైతు కుటుంబాలకు, యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలోకి కొత్త కంపెనీలను తీసుకువచ్చి స్థానికులకు ఉపాధి కల్పించడం చేతకాకపోతే, రైతుల వద్ద నుంచి తీసుకున్న భూములను తక్షణమే వారికే తిరిగి ఇచ్చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు.



మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక స్పష్టమైన విజన్‌తో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని గుర్తుచేశారు. రాష్ట్రంలో అభివృద్ధి అవసరమే అయినప్పటికీ రైతుల ప్రయోజనాలు, వారి భూములకు తగిన పరిహారం, వారి కుటుంబాల భవిష్యత్తును కాపాడటమే అత్యంత కీలకమని తెలిపారు. రైతులకు వెంటనే పూర్తి న్యాయం చేసి, భూములకు తగిన పరిహారం చెల్లించి స్థానికులకు ఉపాధి కల్పించాలని, లేని పక్షంలో భూములను రైతులకు తిరిగి అప్పగించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# జాతీయ స్థాయి స్పెల్-బీ పోటీలకు సత్యశోధక్ విద్యార్థినుల ఎంపికరాష్ట్ర స్థాయిలో ప్రతిభ.. జాతీయ పోటీలకు అర్హత

**నిజామాబాద్ రూరల్, ఆగస్టు 22, నేటి శుభోదయ :** విశ్వం ఎడ్యుటెక్ స్కూల్ ల్యాబ్స్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి స్పెల్–బీ పోటీలకు సత్యశోధక్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్పెల్–బీ పోటీల్లో సత్యశోధక్ పాఠశాలకు చెందిన ఎం. మేఘన, సి.హెచ్. స్వేచ్ఛ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, వివిధ విభాగాల్లో రాష్ట్ర స్థాయి టాపర్లుగా నిలిచి ఛాంపియన్‌షిప్ అవార్డులు సాధించారు.రాష్ట్ర స్థాయి పోటీల్లో కనబరిచిన ప్రతిభ ఆధారంగా ఈ ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నరసయ్య శనివారం ప్రవేశ పత్రాలను అందజేసి అభినందించారు.జాతీయ స్థాయిలో కూడా అదే స్ఫూర్తితో ప్రతిభ కనబరిచి విజయం సాధించి, సత్యశోధక్ పాఠశాలతో పాటు నిజామాబాద్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ప్రతిభను ఉపాధ్యాయ



సిబ్బంది, తోటి విద్యార్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# సిరికొండలో విజృంభించనున్న సీజనల్ వ్యాధులు

**— ముందస్తు నివారణ చర్యలు చేపట్టిన సర్పంచ్ మల్లేల సాయిచరణ్**

**నిజామాబాద్ రూరల్, ఆగస్టు 22, నేటి శుభోదయ :** వర్షాకాలం నేపథ్యంలో గ్రామంలో విష జ్వరాలు, డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సిరికొండ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ముందస్తు నివారణ చర్యలు విస్తృతంగా చేపట్టారు. గ్రామ సర్పంచ్ మల్లేల సాయి చరణ్ ప్రత్యేక చొరవతో గ్రామంలోని నీటి గుంతలు, ఓపెన్ ప్లాట్లు, నిల్వ నీరు ఉన్న ప్రదేశాలలో దోమల ఉత్పత్తిని అరికట్టడానికి ఆయిల్ బాల్స్ వేశారు.దీంతో పాటు దోమల నివారణకు గ్రామంలోని వీధులు, వార్డుల ప్యానెళ్లలో మలాథియన్ మందుతో పొగ (ఫాగింగ్) పిచికారీ చేయించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మల్లేల సాయిచరణ్ మాట్లాడుతూ గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణే మా మొదటి ప్రాధాన్యత. వర్షాకాలంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని" గ్రామస్తులను కోరారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గ్యామ శోభన్, పంచాయతీ కార్యదర్శి వినీల్, ANM స్వరూప, ఆశ వర్కర్లు, కారోబార్ ప్రవీణ్ మరియు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



# నీటి కుంటల నిర్మాణంతో భూగర్భ జలాల అభివృద్ధి

**- ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**ఖమ్మం, ఆగస్టు 22, నేటి శుభోదయ :** రైతుల పొలాల్లో నిర్మిస్తున్న నీటి కుంటలు (ఫారం పాండ్లు) భూగర్భ జలాల అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని జిల్లా కలెక్టర్ శ్రీ దివాకర టిఎస్ అన్నారు. శనివారం కూసుమంచి మండల కేంద్రానికి చెందిన రైతు అర్వపల్లి వెంకటేశ్వర్లు పొలంలో నిర్మిస్తున్న నీటి కుంటను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రధాన రహదారి నుంచి సుమారు 600 మీటర్ల మేర డొంక రహదారిలో నడుచుకుంటూ వెళ్లి నీటి కుంట నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నీటి కుంటల నిర్మాణం వల్ల వర్షపు నీటిని నిల్వ చేసుకోవడంతో పాటు, ఆ నీరు భూమిలోకి ఇంకి సమీపంలోని బోర్లు, బావుల్లో భూగర్భ జలమట్టం పెరుగుతుందని అన్నారు. నీటి నిల్వలు పెరగడం వల్ల భవిష్యత్తులో మత్స్య సంపద అభివృద్ధికి కూడా అవకాశం ఉంటుందని తెలిపారు. రైతులు తమ పొలాల్లో నీటి సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం నీటి కుంట నిర్మాణం, పనుల పురోగతి, రైతులకు కలిగే ప్రయోజనాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ వివరాలు తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో



పనులను పరిశీలించి, రైతులకు ఉపయోగపడే విధంగా పనులు నాణ్యతతో చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి తహసీల్దార్ సైదులు, గ్రామపంచాయతీ సర్పంచ్ కొండ కృష్ణవేణి, గ్రామపంచాయతీ కార్యదర్శి, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం



**కేశంపేట, ఆగస్టు 22, నేటి శుభోదయ :** కేశంపేట మండలం తొమ్మిదిరేకుల గ్రామంలో శనివారం సర్పంచ్ బీస కవిత కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి ఇంటికీ తాగునీరు అందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలోని ప్రతి కుటుంబానికి నల్లా ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యమని సర్పంచ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాగునీటి కోసం మహిళలు, గ్రామ ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి లేకుండా చూడాలని అన్నారు. ప్రతి ఇంటికీ తాగునీటి సౌకర్యం కల్పించడం ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు సమయాన్ని, శ్రమను ఆదా చేయవచ్చన్నారు. గ్రామంలో తాగునీటి సమస్యలు ఉన్న ప్రాంతాలను గుర్తించి పరిష్కరించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నీటి వనరులను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు నీటిని వృథా చేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామీణ నీటి సరఫరా శాఖ సహాయ ఇంజినీర్ నరేష్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అవినాష్ గౌడ్, గ్రామ పంచాయతీ అధికారి కృష్ణయ్య, వార్డు సభ్యులు పోగుల నర్సింలు, నరేష్, లచ్చిరామ్ నాయక్, నాగిళ్ల ప్రేమలత యాదయ్య, కందెన సంతోష శివయ్య, గ్రామస్తులు గుత్తి శేఖర్, నిరంజన్, లాలమెని పాండు, శంభుల శేఖర్, వెంకటయ్య, గోస్కే కృష్ణయ్య, కానుగుల వెంకటయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ మండల నూతన కమిటీల ఏకగ్రీవంగా ఎన్నిక

**- సామాజిక న్యాయం కోసం పనిచేయాలని నాయకుల పిలుపు**



**వరంగల్, ఆగస్టు 21, నేటి శుభోదయ :** మాదిగ సమాజం ఆర్థిక అసమానతలను అధిగమించాలని మాదిగ సంక్షేమ పరిషత్ జాతీయ నాయకులు, వరంగల్ జిల్లా ఇంచార్జి వంగూరి ఆనంద్ రావు అన్నారు.పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు వరంగల్ మండల కేంద్రంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, మాదిగ సంక్షేమ పరిషత్ అనుబంధ సంఘాల మండల సదస్సు నిర్వహించారు. శనివారం వరంగల్ నగరంలోని కాశీబుగ్గ ప్రాంతంలో లక్ష్మీపురం కమిటీ హాల్ లో ముఖ్య నాయకుల సమావేశంలో ఎమ్మార్పీఎస్



వరంగల్ మండల ఇంచార్జి కన్నెబోయిన ప్రమోద్ మాదిగ అధ్యక్షతన తూర్పు నియోజకవర్గ ఇంచార్జి గంగారపు మల్లన్న మాదిగ సభాధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా మాదిగ సంక్షేమ పరిషత్ జాతీయ నాయకులు, వరంగల్ జిల్లా ఇంచార్జి వంగూరి ఆనంద్ రావు మాదిగ, మాదిగ సంక్షేమ పరిషత్ మాజీ జిల్లా అధ్యక్షులు కల్లేపల్లి ప్రణయ్ దీపు మాదిగ, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మాజీ జిల్లా అధ్యక్షులు కట్ల రాజశేఖర్ మాదిగ హాజరై వారు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో సాగుతున్న ఆత్మగౌరవ ఉద్యమం, సామాజిక న్యాయం కోసం జరుగుతున్న పోరాటాలను వివరించారు. సమ సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

### మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మండల కమిటీ

మండల అధ్యక్షులుగా : ఐత చంద్రమౌళి మాదిగ,అధికార ప్రతినిధి: చింత సతీష్ మాదిగ,ప్రధాన కార్యదర్శి: మోలుగురి శ్యామ్ మాదిగ,ప్రధాన కార్యదర్శి–2: ఇసంపెల్లి ప్రశాంత్ మాదిగ,ఉపాధ్యక్షులు: దౌడు నరేష్ మాదిగ,జన్ను కరుణాకర్,మామునూరి అనిల్ మాదిగ,సంక్షేమ పరిషత్ మండల కమిటీ:అధ్యక్షులు: వశపోతుల శ్రీనివాస్ మాదిగ,అధికార ప్రతినిధి: ఇసంపెల్లి బాబురావు మాదిగ,ప్రధాన కార్యదర్శి: ముత్యాల రవి మాదిగ,ఉపాధ్యక్షులు: కవ్వంపల్లి రవి మాదిగ, రాషపెల్లి అశోక్,జన్ను నాని,కార్యదర్శి: బిర్రు కొమురయ్య,సహాయ కార్యదర్శి: పుల్ల అంజిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు

### మండల ఎన్నికకు సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు

వరంగల్ మండల నూతన కమిటీ ఎన్నికకు సహకరించిన రాష్ట్ర, జిల్లా, మండల నాయకులకు, కార్యకర్తలకు ఐత చంద్రమౌళి మాదిగ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుని సంఘం బలోపేతానికి, సామాజిక న్యాయం కోసం కృషి చేస్తానని తెలిపారు.

## అర్బన్ లో డబుల్ బెడ్ రూమ్ టవర్లు నిర్మించాలి

**- అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ**



**నిజామాబాద్, ఆగస్టు 22, నేటి శుభోదయ :** నియోజకవర్గంలో స్థలం లేని వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల టవర్లను నిర్మించి ఇవ్వాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ తెలిపారు.నగరంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....నగరంలో పేదలకు స్థలం ఉండే అవకాశం లేదని,కావున ప్రభుత్వ స్థలంలోనే హైదరాబాద్ తరహాలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల టవర్లను నిర్మించాలని కోరారు.ప్రధానంగా రెండు దశల్లో గత 12 సంవత్సరాలుగా తెలంగాణలో డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వని నియోజక వర్గం కేవలం నిజామాబాద్ అర్బన్ మాత్రమే అన్నారు.ఇప్పటికైనా ఇవ్వడం సంతోషకరమన్నారు.ఇటీవల మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి ఇందిరమ్మ ఇల్లు,డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకి సంబంధించి పలు అంశాలను తీసుకెళ్లానని గుర్తు చేశారు.

## సదాశివపేట ప్రభుత్వ ఆసుపత్రి పై సమగ్ర విచారణ జరిపించాలి

**- విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న సూపర్డెంట్ పై కఠిన చర్యలు తీసుకోవాలి**

**- సిపిఎం సదాశివపేట ఏరియా కార్యదర్శి వి ప్రవీణ్ కుమార్..**



**సంగారెడ్డి, ఆగస్టు 22, నేటి శుభోదయ :** సదాశివపేట పట్టణంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో జరుగుతున్న విషయాలపై సమగ్ర విచారణ జరిపించాలని, బాత్రూంలో చనిపోయిన పాప విషయంలో అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విదులపట్ల నిర్లక్ష్యం వహిస్తున్న సుపరిండెంట్ పైన చర్యలు తీసుకోవాలని సిపిఎం సదాశివపేట ఏరియా కార్యదర్శి వి ప్రవీణ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈరోజు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఉన్న డి సి హెచ్ ఎస్ ఆఫీస్ లో సీనియర్ అసిస్టెంట్ వెంకటేశంకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది..ఈ సందర్భంగా వి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ సదాశివపేట పట్టణంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో జరుగుతున్న విషయాలపైన సమగ్ర విచారణ జరిపించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు చనిపోయిన పాప బాత్రూంలో దొరకడం అంటే ఎంత నిర్లక్ష్యంగా ఆసుపత్రి సిబ్బంది వ్యవహరిస్తున్నారు అర్థం అవుతుంది అన్నారు. ఆస్పత్రి సూపరిండెంట్ విధుల పట్ల చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడు, సరిగా ఏ ఒక్క రోజు కూడా విధులకు హాజరు కావడం లేదు అన్నారు. సూపరిండెంట్ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న సూపర్డెంట్ పైన చర్యలు తీసుకోవాలని అయినా కోరారు. చనిపోయిన పాప బాత్రూంలో ఉండటం ప్రజలు చాలా భయంతోనులకు గురి అవుతున్నారు. సదాశివపేట ప్రభుత్వ ఆసుపత్రి పైన సమగ్ర విచారణ జరిపించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు జిల్లాస్థాయి అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆయన అన్నారు. ఈ వినపత్రం సమర్పించిన వారిలో సిపిఎం నాయకులు అనిల్ చంద్రయ్య గోపాల్ తదితరులు పాల్గొన్నారు

## పార్టీనియం నిర్మూలనపై రైతులకు అవగాహన కార్యక్రమం



**ముత్తారం, ఆగస్టు 22, నేటి శుభోదయ :** ముత్తారం మండలంలోని ముత్తారం ఖమ్మం పల్లి రైతు వేదికలలో మండల వ్యవసాయ అధికారి అనూష ఆధ్వర్యంలో శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం,కృషి విజ్ఞాన కేంద్రంరామగిరి ఖిల్లా,వ్యవసాయ శాఖ సంయుక్తంగా పార్టీనియం నిర్మూలన పై రైతులకు అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త వినోద్ కుమార్,కృషి విజ్ఞాన కేంద్రం రామగిరి ఖిల్లా వెంకన్న,వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్తలు పార్టీనియం వల్ల పంటలు,మనుషులు,జంతువులకు కలిగే నష్టాలను రైతులకు వివరించారు.పార్థీనియం అనే కలుపు మొక్క పత్తి,కంది,పొలం గట్ల మీద అధికంగా ఉండి పంట దిగుబడిని 35 శాతం వరకు తగ్గిస్తుందని దీనితోపాటు పంటకు పోషకాలను,నీటిని అందకుండా చేస్తూ ఎదుగుదలను అడ్డుకుంటుందని వివరించారు.అలాగే మనుషులకు, జంతువులకు పార్టీనియం వలన విషపూరిత ప్రభావాలు ఉంటాయని తెలిపారు. మనుషుల్లో అయితే చర్మ సంబంధిత ఎలర్జీలు,శ్వాస సంబంధిత సమస్యలు,పశువుల్లో పాలు చేదుగా మారే అవకాశం ఉన్నందున రైతులు ఎప్పటికప్పుడు వీటిని పూత రాకముందే తీసివేసి ఖాళీ ప్రదేశాల్లో వీటిని తగులబెట్టి శాశ్వతంగా నిర్మూలన చేయాలని సూచించారు.లేనిచో ఈ కలుపు మొక్క పుప్పొడి వేల సంఖ్యలో విత్తనాలను వెదజల్లుతూ పంటకి తీవ్ర నష్టం చేకూరుస్తుందన్నారు.రసాయనిక పరంగా నిర్మూలన చూసినట్లయితే 2, 4డి గ్లైఫోసిట్ వంటి మందులతో దీనిని నిర్మూలించవచ్చు అని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అనుష,వ్యవసాయ విస్తరణ అధికారులు,అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# ప్రతి బాలబాలికకు భద్రమైన బాల్యాన్ని అందించడం మనందరి బాధ్యత

**- జిల్లా న్యాయసేవా సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు**

- విద్యార్థుల్లో చట్టపరమైన అవగాహన పెంపొందించడం అత్యంత ఆవశ్యకం
- గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై పాఠశాలల్లో విస్తృత అవగాహన కల్పించాలి
- పిల్లల ప్రవర్తనలో వచ్చే మార్పులను టీచర్లు నిశితంగా గమనించాలి



**ఖమ్మం, ఆగస్టు 22, నేటి శుభోదయ :** ప్రతి చిన్నారికి సురక్షితమైన, భద్రమైన బాల్యాన్ని అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి ప్రాథమిక బాధ్యత అని జిల్లా న్యాయసేవా సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. నాగరాజు పిలుపునిచ్చారు. శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సమావేశ మందిరంలో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పిల్లలకు అనుకూలమైన న్యాయ సేవల పథకం–2024 క్రింద బాలల సంరక్షణ అధికారుల కోసం ఏర్పాటు చేసిన ఒక రోజు ప్రత్యేక అవగాహన సదస్సును జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ, తల్లి కోడి తన రెక్కల కింద పిల్లలను పెట్టుకుని ప్రమాదాల నుండి ఎలా ఆప్యాయంగా కాపాడుకుంటుందో, సమాజంలో ఉపాధ్యాయులు కూడా విద్యార్థులను అదే రీతిలో ప్రేమతో, బాధ్యతతో సంరక్షించాలని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు చిన్ననాటి నుంచే చట్టాలపై, తమ ప్రాథమిక హక్కులపై స్పష్టమైన అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలల్లో చిన్న పిల్లలకు 'గుడ్ టచ్.. బ్యాడ్ టచ్' గురించి సరైన రీతిలో అర్థమయ్యేలా విడమరిచి చెప్పాలన్నారు. అనవసరపు స్పర్శను గుర్తించి, వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలిపేలా వారిలో ధైర్యాన్ని నింపాలన్నారు.విద్యార్థుల ప్రవర్తనలో ఏవైనా అసాధారణ మార్పులు (భయం, ఒంటరితనం, ఆందోళన) కనిపిస్తే టీచర్లు వెంటనే గమనించాలన్నారు. పిల్లలతో స్నేహపూర్వకంగా ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించే మార్గదర్శకులుగా నిలవాలన్నారు.బాలల సంరక్షణ అధికారులు తమ విధులను కేవలం ఒక ఉద్యోగంగా కాకుండా, సామాజిక బాధ్యతగా భావించి సమర్థవంతంగా పనిచేయాలన్నారు. బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, పిల్లలపై జరుగుతున్న వేధింపులపై తక్షణమే స్పందించి బాధితులకు అండగా నిలవాలన్నారు. "మొక్కై వంగనిది.. మానై వంగునా.." అనే సామెతను గుర్తు చేస్తూ, బాల్యం నుంచే పిల్లలకు మంచి నడవడిక, బుద్ధులు, నైతిక విలువలు నేర్పించడం చాలా అవసరమని తెలిపారు. బాల్యాన్ని సరైన మార్గంలో తీర్చిదిద్దితేనే వారి భవిష్యత్తు, సమాజ భవిష్యత్తు బాగుంటుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అన్నారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ నేటి డిజిటల్ యుగంలో సమాజం చాలా వేగంగా మారుతోందని, దీనివల్ల బాలలు ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లు కూడా కొత్త రూపు సంతరించుకుంటున్నాయని అన్నారు. అధికారులందరూ చట్ట పరిధిని, తాజా నిబంధనలను క్షుణ్ణంగా అర్థం చేసుకుని, సమర్థవంతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. చట్టాల అమలు క్షేత్రస్థాయిలో మాత్రమే స్పష్టమైన ఫలితాలను ఇస్తుందని, అందుకే ప్రాథమిక స్థాయిలో పనిచేసే సిబ్బందికి చట్టాలపై నిరంతరం అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉందన్నారు. బాలల సంక్షేమం, హక్కుల కాపాడటంలో ఎలాంటి అలసత్వానికీ తావులేదని స్పష్టం చేశారు. ప్రతి బిడ్డకు సురక్షితమైన వాతావరణం కల్పించేలా జువైనల్ జస్టిస్ యాక్ట్, పోక్సో చట్టం వంటి విధానాలను బాధ్యతాయుతంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు డా. పి.పి. కృష్ణ అర్జున్, డా. జి.వి. మహేష్ నాథ్, వి. శ్రీనయ్య, ఎం. శ్రీనివాస్, ఎం. కల్పన, వి. శివ రంజని, టి. మురళి మోహన్, పి. దేవి మానస, షేక్ మీరా ఖాసీం సాహెబ్, కె. జ్యోతిర్మయి, బి. రజని, వై. బిందుప్రియ, ఎ. ప్రవీణ్, బి. నాగలక్ష్మి , జి. అఖిల గౌడ్, వి. దీప్తి, జి. నిష్క, బి. నాగ సుమ బాల, వి. లావణ్య, జిల్లా బాల సంరక్షణ అధికారిణి విష్ణు వందన, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## ఏ సమస్య వచ్చినా మా దృష్టికి తెండి

**- మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ**

**ఖమ్మం, ఆగస్టు 22, నేటి శుభోదయ :** ఖమ్మం జిల్లా, వైరా మున్సిపాలిటీ పరిధిలో వార్డులలో ఏ సమస్య వచ్చినా దాన్ని సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ తెలిపారు. వైరాలోని 12, 13 వ వార్డులలో బురదమయంతో గుంతలతోనిండిన రహదారులను మరమ్మత్తు పనులను పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడుతూ మా పరిధిలో ఉన్న ప్రతి పనిని చేయటానికి ప్రయత్నిస్తానని అదే విధంగా సత్రం బజారులో ఈ 12, 13 వార్డులో కలిపి ఉన్న రహదారికి త్వరలో టెండర్లు పూర్తవుతాయని పర్మినెంట్ గా సిమెంట్ రోడ్డు వేయడానికి చర్యలు మున్సిపాలిటీ తీసుకుంటుందని ఆమె ఈ సందర్భంగా తెలిపారు. ఆయా వార్డులలో ఉన్న ప్రజలు తమ వంతు బాధ్యతగా వ్యవహరించి సమస్యను సానుకూలంగా పరిష్కరించే దిశగా ఉండాలని అదే విధంగా వైరా మున్సిపాలిటీ కూడా ప్రజల సహకారం కూడా అవసరమని ప్రతి ఇంటి



యజమాని తమ తమ ఇంటి పన్నులను సకాలంలో చెల్లించి వైరా మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని ఆమె పేర్కొన్నారు. అనంతరం వార్డు యువకులు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా ఈ రహదారి పరిష్కారం లేక మరుగున పడిపోయిందని వర్షం వస్తే నీళ్లు ఇళ్లల్లోకి చేరి నానా ఇబ్బందులు పడుతున్నామని వారు తెలిపారు. ఇప్పటికైనా నూతన పాలక మండలి మా సమస్యను పరిష్కరించే దిశగా ఆలోచించాలని రహదారికి సిమెంటు రోడ్డు ఏర్పాటుకు ఇరుపక్కల డ్రైనేజ్ విస్తరణ చర్యలు చేపట్టాలని విన్నవించారు. మా వార్డుల సమస్యను మున్సిపల్ అధికారులకు చైర్పర్సన్ దృష్టికి తీసుకురాగానే కొంతలో కొంతైనా సమస్య పరిష్కరించినందుకు గ్రావెల్ తో మరమ్మత్తులు చేసి చేపట్టినందుకు మున్సిపల్ చైర్పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళను మున్సిపల్ సిబ్బందిని అభినందించారు. అనంతరం మున్సిపల్ ఏఈ రహదారి పనులను దగ్గరుండి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పెన్షనర్లు, ఉద్యోగుల పట్ల ప్రభుత్వ వైఖరి మారాలి

**- ఎస్జిపిఏటి అధ్యక్షులు పరిశ పుల్లయ్య**

**ఖమ్మం, ఆగస్టు 22, నేటి శుభోదయ :** పెన్షనర్లు, ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ వైఖరి మారాలని, పెన్షనర్ల, ఉద్యోగుల సమస్యలు సత్వరం పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం(ఎస్జిపిఏటి)జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కృషిభవన్ లో ఎస్జిపిఏటి ముఖ్యకార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య అధ్యక్షతన జరిగింది. మూడు సంవత్సరాలు గడిచినా పెన్షనర్ల, ఉద్యోగుల ఉమ్మడి డిమాండ్ అయిన పిఆర్సి, ఆరు డిఏలు మంజూరు లో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నదని, మూడు నెలలుగా హెల్త్ ప్రీమియం మినహాయిస్తున్న ప్రభుత్వం నగదు రహిత వైద్యం అమలు చేయటంలో నిర్లిప్తత వహిస్తున్నదని పెన్షనర్ల సంఘం నేత పరిశ పుల్లయ్య విమర్శించారు.2024 మార్చి తరువాత ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్లు అందరికి ఇప్పటివరకు పూర్తి స్థాయిలో బకాయిలు చెల్లించలేదని,సిపిఎస్ రద్దు పరచి ఒపిఎస్ అమలు చేయడం లో ప్రభుత్వ కపట ప్రేమ కనిపిస్తున్నదని, ఇప్పటికైనా ప్రభుత్వం చిత్తశుద్ధితో పెన్షనర్ల, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని పెన్షనర్ల సంఘం నేత పరిశ పుల్లయ్య డిమాండ్ చేశారు.పెన్షనర్ల, ఉద్యోగుల ఉమ్మడి సమస్యల పరిష్కారానికి ఈనెల 27న కలెక్టరేట్ వద్ద




టిజిఇజేఏసి పిలుపు మేరకు జరిగే మహాధర్నా లో వందలాది పెన్షనర్లు పాల్గొని సత్తా చాటాలని ఎస్జిపిఏటి జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లను కోరారు.సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి మేరి ఏసుపాదం, జిల్లా నాయకులు రవికుమార్, తాడిఅంజలి, ఊడుగు వెంకటేశ్వర్లు, బెల్లంరాధాకృష్ణమూర్తి, కనపర్తినాగప్రసాద్,ఊడుగు సుధాకర్ రావు,యండిహుస్సేన్, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

# హర్‌ఘర్ జల్‌తో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నీరు



**కేశంపేట, ఆగస్టు 22, నేటి శుభోదయ :** కేశంపేట మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హర్‌ఘర్ జల్ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి కుటుంబానికి సురక్షితమైన, స్వచ్ఛమైన తాగునీటిని నల్లాల ద్వారా అందించడమే పథకం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజల ఆరోగ్యం, సంక్షేమానికి పరిశుభ్రమైన తాగునీరు ఎంతో అవసరమని అన్నారు.ప్రతి ఇంటికీ తాగునీరు అందుబాటులోకి రావడం వల్ల మహిళలు, వృద్ధులు, చిన్నారులు నీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు తొలగిపోతాయని సర్పంచ్ పేర్కొన్నారు. స్వచ్ఛమైన నీరు అందుబాటులో ఉంటే అనేక అనారోగ్య సమస్యలను నివారించవచ్చని తెలిపారు. గ్రామంలోని నీటి వనరులను పరిరక్షించడంతో పాటు నీటిని వృథా చేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న తాగునీటి పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రతి ఇంటికీ నీటి సౌకర్యం అందేలా కృషి చేయాలని అన్నారు. గ్రామపంచాయతీ ప్రజలకు అవసరమైన సహకారం అందిస్తూ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరేష్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్, వార్డు సభ్యులు రిజ్వాన బేగం, మోహిజ్, వెంకటమ్మ, మల్లయ్య, నాయకులు ముత్యాలు, వాజీద్, యాదయ్య, సాదిక్, షాబొద్దిన్, పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# గరీబ్ నగర్‌లో రూ. 1.30 లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అనన్య



**వికారాబాద్, ఆగస్టు 22, నేటి శుభోదయ :** వికారాబాద్ జిల్లా కేంద్రంలోని 30వ వార్డు గరీబ్ నగర్ కాలనీలో కౌన్సిలర్ కాకి విజయలక్ష్మి నాగరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అనన్య రూ. 1.30 లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులకు నాంది పలికారు. పట్టణంలోని ప్రతి వార్డులో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా గడ్డం అనన్య స్పష్టం చేశారు.కాలనీవాసుల మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ, ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి ఈ పనులు చేపట్టినట్లు ప్రజాప్రతినిధులు వెల్లడించారు. స్థానిక నాయకుడు గడ్డం ప్రసాద్ కుమార్ అందించిన సహకారంతో గరీబ్ నగర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం కావడం పట్ల స్థానిక ప్రజలు తీవ్ర హర్షం వ్యక్తం చేశారు.తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ప్రజల సంక్షేమం, పట్టణాభివృద్ధికి పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతోందని నాయకులు పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో వికారాబాద్ పట్టణ పరిధిలో ప్రజలకు నిత్యం అవసరమయ్యే రహదారులు, డ్రైనేజీ వ్యవస్థలు తదితర మౌలిక వసతుల మెరుగుదలకు వేగవంతంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు మరియు కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నిర్దవెల్లిలో ఘనంగా చాకలి ఐలమ్మ విగ్రహానికి భూమి పూజ



**కేశంపేట, ఆగస్టు 22, నేటి శుభోదయ :** కేశంపేట్ మండలంలోని నిర్దవెల్లి గ్రామంలో వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, గ్రామ పెద్దలు, రజక సంఘం సభ్యులు చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం, సామాజిక న్యాయం, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహనీయుల స్ఫూర్తిని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని వారు పేర్కొన్నారు.చాకలి ఐలమ్మ తన ధైర్యసాహసాలతో అన్యాయానికి, దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి ప్రజల్లో చైతన్యం నింపారని గుర్తుచేశారు. ఆమె పోరాటం కేవలం ఒక వర్గానికే పరిమితం కాకుండా సమాజంలో సమానత్వం, ఆత్మగౌరవం, స్వేచ్ఛ కోసం సాగిన ఉద్యమంగా నిలిచిందన్నారు. దేశభక్తి, ధైర్యం, త్యాగం, ప్రజాసేవ వంటి విలువలను యువత అలవర్చుకోవాలని సూచించారు.గ్రామంలో ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయడం ఆమె పోరాట చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేసే గొప్ప కార్యక్రమమని అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భాస్కర్ గౌడ్, బీఆర్ఎస్ కేశంపేట్ మండల అధ్యక్షుడు తోట వెంకటేష్, మాజీ ఉపసర్పంచ్ సిల్వర్ మల్లయ్య, వాజీద్, రజక సంఘం సభ్యులు జంగయ్య, బాలకృష్ణ, రాజు, మహేష్, బాలు, శివ, పరిశుద్ధ కార్మికులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం చేయూత పథకంలో బీడీ కార్మికులకు జీవన భృతి ఇవ్వాలి లేనిచో ఆందోళనలు ఉధృతం చేస్తాం

**- వనమాల కృష్ణ రాష్ట్ర అధ్యక్షులు,తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్**

**నిజామాబాద్, ఆగస్టు 22, నేటి శుభోదయ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన చేయూత పెన్షన్ పథకంలో బీడీ కార్మికులందరికీ జీవన భృతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి ధర్నా చౌక్ వద్ద మహా ధర్నా నిర్వహించడం జరిగింది.ఈ సభకు యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.రాజేశ్వర్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వనమాల కృష్ణ మాట్లాడుతూ....రాష్ట్ర ప్రభుత్వం ఈనెల చివరి నాటికి చేయూత పెన్షన్ కొరకు దరఖాస్తు చేసుకోవాలని అప్లికేషన్ మోడల్ ను విడుదల చేసిందన్నారు.ఇందులో చేనేత కార్మికులు,గీతా కార్మికులకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారనీ,కానీ బీడీ కార్మికులకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించలేదన్నారు.ఇది బీడీ కార్మికుల పట్ల కక్షపూరిత వైఖరిని తెలియజేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం బీడీ కార్మికులకు చేయూత పెన్షన్లలో జీవనభృతి కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.లేనిచో రాష్ట్రవ్యాప్తంగా బీడీ కార్మికులతో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరేందర్ మాట్లాడుతూ..బీడీ కార్మికులకు పని దినాలు తక్కువై పూటగడవడం కష్టమైందన్నారు.యూనియన్ నాయకత్వంలో బీడీ కార్మికులు పోరాడి జీవన భృతిని సాధించుకున్నారు,జీవన భృతి వీరి జీవితాలకు కొంత ఊరటనిచ్చిందన్నారు.కానీ ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం బీడీ కార్మికులకు




మొండిచేయి చూపించే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. బీడీలు చుట్టే కార్మికులకు, బీడీ ప్యాకర్లకు,నెలసరి జీతాల ఉద్యోగులకు,బీడీ కమిషన్ ఏజెంట్లకు చేయూత పెన్షన్లలో జీవనభృతి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.టియుసిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శులు బి.మల్లేష్,డి.కిషన్ లు మాట్లాడారు.యూనియన్ జిల్లా నాయకులు సాయరెడ్డి, లింగం లక్ష్మి , వసంత, అంజమ్మ,ప్రజాసంఘాల నాయకులు గణేష్, సాయిబాబా నాగమణి,సృజన్ శ్రీశాంత్ అరుణోదయ కళాకారులు గంగాధర్,రమేష్,చరణ్ లు తమ పాటలతో బీడీ కార్మికులను చైతన్యపరిచారు.ధర్నా అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ కార్యాలయంలో అందజేయడం జరిగింది.

# పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో జాప్యంపై మంత్రి పొంగులేటి ఆగ్రహం






**నిజామాబాద్, ఆగస్టు 22, నేటి శుభోదయ :** రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన భూ రీసర్వేను వేగవంతం చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు.ఏడాదిన్నర లోపు వ్యవసాయ భూములతోపాటు ఆబాదీ ఆస్తుల రీసర్వే పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. శనివారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.నాగారంలోని నిర్మితి కేంద్రంలో ఇందిరమ్మ హౌసింగ్ టవర్స్ కోసం స్థలాన్ని పరిశీలించారు.అలాగే పాముల బస్తీలో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులతో ముఖాముఖి నిర్వహించారు.ఆ తర్వాత డబుల్ బెడ్ రూమ్ లబ్దిదారులకు ఇళ్ళ పట్టాలు అందజేశారు.అనంతరం కలెక్టరేట్‌లో నిజామాబాద్,కామారెడ్డి జిల్లాల రెవెన్యూ,హౌసింగ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్,సర్వే శాఖల అధికారులతో మంత్రి సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రజలను అనవసరంగా కార్యాలయాల చుట్టూ తిప్పుతూ ఇబ్బందులకు గురిచేస్తే మాత్రం ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.పదేపదే సూచించినా పనితీరులో మార్పు రాని అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు,సాదాబైనామా అర్జీల పరిష్కారంలో జాప్యం చేస్తున్న తహసీల్దార్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రజల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.రాష్ట్రంలోని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం రీ సర్వే చేపడుతోందని తెలిపారు.ఏడాదిన్నరలోపు వ్యవసాయ భూములతో పాటు ఆబాది ఆస్తుల రీ సర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు.తొలి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో రీ సర్వే కొనసాగుతోందన్నారు.రీ సర్వే జరుగుతున్న గ్రామాల్లో కలెక్టర్లు,రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పేదల సొంతింటి కలను సాకారం చేసి వారి ఆత్మగౌరవాన్ని పెంపొందించడమే ప్రజా ప్రభుత్వ సంకల్పమని అన్నారు.కులం,మతం,రాజకీయాలకు అతీతంగా, పట్టణం,గ్రామం, గూడెం,తండా అనే తేడా లేకుండా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని స్పష్టం చేశారు.పట్టణాలు,నగరాల్లో ఇళ్ల స్థలాలు లేని నిరుపేదల కోసం హైదరాబాద్ తరహాలో రాష్ట్రంలోని ప్రముఖ పట్టణాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు.ఇందులో భాగంగానే నిజామాబాద్‌లో ప్రయోగాత్మకంగా టవర్స్ నిర్మించేందుకు స్థలాన్ని పరిశీలించినట్లు చెప్పారు.ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నిర్మాణ వ్యయం తగ్గించేందుకు సిమెంట్ బ్యాగ్‌ను కేవలం రూ.230కే అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.పేద కుటుంబాలపై నిర్మాణ భారం తగ్గించడంతో పాటు ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు.43వ డివిజన్‌లోని పాముల బస్తీలో ఇందిరమ్మ పథకం కింద నిర్మాణం పూర్తయిన ఇళ్లను పరిశీలించారు.లబ్దిదారులతో మాట్లాడి బిల్లులు సకాలంలో అందుతున్నాయా,నిర్మాణంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వం తమ సొంతింటి కలను సాకారం చేసిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మంత్రి పొంగులేటికి కృతజ్ఞతలు తెలిపారు.లబ్ధిదారుల సంతోషంలో భాగస్వామ్యం కావడం తనకు ఎంతో ఆనందంగా ఉందని మంత్రి పేర్కొంటూ,నూతన గృహ ప్రవేశం చేసుకున్న కుటుంబాలకు శుభాకాంక్షలు తెలిపారు.నూతన వస్త్రాలను బహూకరించారు.చివరి దశలో ఉన్న ఇళ్లను కూడా పరిశీలించి పనులను త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు.అనంతరం ఐడీఓసీని ఆనుకుని నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మంత్రి పరిశీలించారు.పెండింగ్ పనులను తక్షణమే పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.నిధుల కొరత లేదని,పనులు పూర్తయిన 24 గంటల్లోనే బిల్లులు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు.డబుల్ బెడ్‌రూమ్ భవన సముదాయాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి హౌసింగ్ శాఖకు అప్పగించాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్,తాగునీరు,పారిశుధ్య పనులను కూడా వెంటనే పూర్తి చేయాలని సూచించారు.స్థానిక రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గానికి చెందిన 400 మంది లబ్ధిదారులకు మంత్రి పొంగులేటి చేతుల మీదుగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు పత్రాలను పంపిణీ చేశారు.మరో వారం,పది రోజుల్లో మరో 300 మంది లబ్ధిదారులకు ఇళ్లు అందిస్తామని మంత్రి వెల్లడించారు.డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులు పూర్తి పారదర్శకంగా,అర్హత ప్రాతిపదికన జరిగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.మొదటి విడతలో 4.50 లక్షల ఇళ్లు,రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లు,హైదరాబాద్‌లో మరో లక్ష ఇళ్లను కలుపుకుని ఇప్పటివరకు మొత్తం 8 లక్షల ఇళ్లకు మంజూరు ఇచ్చామని మంత్రి తెలిపారు.ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమం నిరంతర ప్రక్రియ అని,అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల సాకారం అయ్యే వరకు విడతల వారీగా ఇళ్లను మంజూరు చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.గత ప్రభుత్వ హయాంలో పదేళ్లలో పేదలకు తగిన స్థాయిలో ఇళ్లు నిర్మించలేదని విమర్శించిన మంత్రి,గత ప్రభుత్వంలో అసంపూర్తిగా మిగిలిపోయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కూడా పూర్తి చేసి లబ్ధిదారులకు అందించే బాధ్యతను ప్రజా ప్రభుత్వం తీసుకుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి,ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్,ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా,డాక్టర్ భూపతి రెడ్డి,నగర మేయర్ ఉమారాణి,హౌసింగ్ శాఖ ఎండీ గౌతమ్,కలెక్టర్ భవేష్ మిశ్రా,రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్,నూడా చైర్మన్ కేశ వేణు తదితరులు పాల్గొన్నారు.

నేటి శుభోదయ
ఆదివారం | హైదరాబాద్
23 - 08 - 2026
www.netisubhodaya.com



# వికారాబాద్ మున్సిపల్ అభివృద్ధే ధ్యేయం : చైర్‌పర్సన్ గడ్డం అనన్య

**- రూ.1.50 కోట్లతో 26, 31, 33 వార్డుల్లో నూతన రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన**



**వికారాబాద్, ఆగస్టు 22, నేటి శుభోదయ :** పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అనన్య తెలిపారు. ఇందులో భాగంగా పట్టణంలోని 26, 31, 33 వార్డుల పరిధిలో సుమారు రూ.1.50 కోట్ల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న నూతన రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణ ప్రజలకు మెరుగైన రహదారి, మౌలిక వసతులు కల్పించడమే మున్సిపల్ పాలకవర్గం ప్రధాన లక్ష్యమని అన్నారు. కాలనీవాసుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా నూతన రోడ్ల నిర్మాణం, అవసరమైన ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు.నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత కాంట్రాక్టర్లు, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో అవసరమైన అభివృద్ధి పనులను దశలవారీగా చేపట్టి వికారాబాద్‌ను మరింత అభివృద్ధి చెందిన పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, నాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# రీ–సర్వే డేటా ఎంట్రీలో తప్పులకు తావులేకుండా జాగ్రత్తగా నమోదు చేయాలి : జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

- **శాటిలైట్ ఆధారిత సర్వే వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలి**
- **భూ విస్తీర్ణం, హద్దుల వివరాల్లో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలి**
- **రీ–సర్వే వివరాలు భవిష్యత్‌లో దీర్ఘకాలం పాటు వినియోగంలో ఉంటాయి**
- **భూ వివరాలతో పాటు కోఆర్డినేట్లతో కూడిన మ్యాప్ అందించనున్నాం**



**ఖమ్మం, ఆగస్టు 22, నేటి శుభోదయ :** రీ–సర్వే డేటా ఎంట్రీలో తప్పులకు తావు లేకుండా జాగ్రత్తగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. కూసుమంచి మండలం భగత్‌వీడు గ్రామంలో కొనసాగుతున్న రీ–సర్వే, డేటా ఎంట్రీ ప్రక్రియను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శనివారం పరిశీలించారు. కూసుమంచి తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న డేటా ఎంట్రీ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్, సర్వే బృందాలు నమోదు చేస్తున్న వివరాలను క్షేత్రస్థాయి సర్వే వివరాలతో పరిశీలించారు.ఈ సందర్భంగా భగత్‌వీడు గ్రామానికి చెందిన ఎ. వీరభద్రం, కె. శ్రీనివాస రెడ్డి, పసుపులేటి నాగేశ్వరరావు, తదితరుల భూముల సర్వే వివరాలను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ రీ–సర్వేలో భాగంగా చేపడుతున్న డేటా ఎంట్రీ ప్రక్రియలో సర్వే బృందాలు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. భూ విస్తీర్ణం, హద్దులు, ఇతర వివరాలను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఖచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు.శాటిలైట్ సాంకేతికతను ఉపయోగించి సర్వే నిర్వహిస్తున్నందున క్షేత్రస్థాయిలో వాస్తవంగా ఉన్న భూ విస్తీర్ణం మేరకే వివరాలు నమోదవుతాయని కలెక్టర్ తెలిపారు. రీ–సర్వే ద్వారా నమోదు చేసే భూ వివరాలు భవిష్యత్‌లో అనేక సంవత్సరాల పాటు ఉపయోగపడతాయని, అందువల్ల డేటా ఎంట్రీ సమయంలో ప్రతి వివరాన్ని ఒకటికి రెండుసార్లు పరిశీలించి నమోదు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రీ–సర్వే పూర్తయిన అనంతరం భూ వివరాలతో పాటు కోఆర్డినేట్లతో కూడిన మ్యాప్‌ను అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రతి భూమికి సంబంధించిన వివరాలు ఖచ్చితంగా నమోదయ్యేలా సర్వే బృందాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.సర్వే ప్రక్రియలో క్షేత్రస్థాయిలో గుర్తించిన వివరాలు, డేటా ఎంట్రీలో నమోదు చేసిన వివరాలకు పూర్తి అనుసంధానం ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట కూసుమంచి తహసీల్దార్ సైదులు, ఆర్ఐ జ్యోతి , సర్వే అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాలికలు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలి

**- భరోసా ఎస్సై షాహినా**



**ఖమ్మం, ఆగస్టు 22, నేటి శుభోదయ :** బాలికలు సామాజిక మాధ్యమానికి దూరంగా ఉండి చదువుపై శ్రద్ధ పెట్టి భవిష్యత్తును చక్కగా తీర్చిదిద్దుకోవాలని భరోసా ఎస్సై షాహినా పిలుపునిచ్చారు. యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ హెడ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక వైరా రోడ్డు నందు గల శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యా సౌధ క్యాంపస్ నందు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూబాలికలు తెలియని వ్యక్తులతో వ్యక్తిగత సమాచారం పంచుకోకూడదు అని మన ఫోటోలు, ఇంటి చిరునామా, ఫోన్ నంబర్, పాస్వర్డ్ వంటి వివరాలను ఎవరికీ ఇవ్వకూడదు అని తెలిపారు.ఎవరైనా సోషల్ మీడియాలో వేధించినా, బెదిరించినా లేదా అనుచితమైన సందేశాలు పంపినా భయపడకుండా వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు లేదా నమ్మకమైన పెద్దలకు తెలియజేయాలి, అని లేదా డయల్ 112 కి , 1930 ఫోన్ చేసి సహాయం పొందాలని అన్నారు.తప్పు చేసిన వ్యక్తి గురించి చెప్పడం మన బలహీనత కాదు అది మన ధైర్యం అని బాలికలలో ధైర్యం నింపారు.మరో అతిథి డాక్టర్ అమీనా మాట్లాడుతూకిశోర వయస్సు అనేది మన శరీరంలో, మనసులో అనేక మార్పులు జరిగే ముఖ్యమైన దశ. ఈ సమయంలో శారీరక మార్పులు రావడం సహజం. వాటి గురించి భయపడాల్సిన అవసరం లేదు, సిగ్గుపడాల్సిన అవసరం కూడా లేదు. సరైన సమాచారం తెలుసుకొని, అవసరమైనప్పుడు తల్లిదండ్రు లు, ఉపాధ్యాయులు లేదా దగ్గరలో ఉన్న ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలి. ప్రతి రోజు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ముఖ్యంగా నెలసరి సమయంలో పరిశుభ్రత చాలా అవసరం అని అన్నారు. శుభ్రమైన, సురక్షితమైన శానిటరీ ప్యాడ్ లేదా ఇతర పరిశుభ్రమైన నెలసరి ఉత్పత్తులను ఉపయోగించాలి అని సూచించారు.మంచి ఆరోగ్యం కోసం పౌష్టికాహారం తీసుకోవడం చాలా ముఖ్యం అని తెలిపారు. బాలికలు అడిగిన పలు ప్రశ్నలకు ఆమె సమాధానాలు ఇచ్చారు. హెచ్పీవీ వ్యాక్సిన్ ప్రతి బాలిక తీసుకోవాలని తద్వారా గర్భాశయంక ద్వారా క్యాన్సర్ ను నివారించడం సులువుతుందని సూచించారు. మరో అతిథి డాక్టర్ సోహెల్ మాట్లాడుతూమంచి ఆరోగ్యం అంటే కేవలం శారీరక ఆరోగ్యం మాత్రమే కాదు, మానసిక ఆరోగ్యం కూడా చాలా ముఖ్యం. జీవితంలో కొన్ని సమస్యలు, అపజయాలు లేదా నిరాశలు రావడం సహజం. కానీ వాటిని చూసి భయపడకుండా, "నేను ఈ సమస్యను ఎదుర్కోగలను, నేను నేర్చుకోగలను, నేను ముందుకు సాగగలను" అనే సానుకూల ఆలోచన కలిగి ఉండాలి అని తెలిపారు. సహాయం కొరకు 14416నెంబర్ కు ఏ సమయంలోనైనా ఫోన్ చేయవచ్చని తెలిపారు.ఎయిడ్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ కే శ్రీనివాస్ మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అర్థాలను ఇబ్బందులను చట్టపరంగా విధించే శిక్షలు జరిమానాల గురించి వివరించారు. 2030 కల్లా బాల్య వివాహ రహిత భారత దేశానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాల్య వివాహాల గురించి తెలిసినట్లయితే 1098 సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎయిడ్ సేవా సంస్థ జిల్లా కోఆర్డినేటర్ కే శ్రీనివాస్, ఎస్సై షాహినా, డాక్టర్ అమీనా, డాక్టర్ సోహెల్, డాక్టర్ అరుణ, భరోసా సెంటర్ రాజకుమారి, సంధ్య, భాస్కర్, కళాశాల ప్రిన్సిపాల్ అనిత తదితరులు పాల్గొన్నారు

# మంత్రితో కలిసి ప్రభుత్వ స్థలం పరిశీలన



**నిజామాబాద్, ఆగస్టు 22, నేటి శుభోదయ :** నగరంలో స్థలం లేని వారికోసం డబుల్ బెడ్ రూమ్ టవర్ల నిర్మాణం కొరకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్య నారాయణ శనివారం ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు.నగరంలోని నాగారం స్టేడియం వద్ద గల రెండెకరాల స్థలాన్ని పరిశీలించారు.అలాగే కలెక్టరేట్ వద్ద గల డబుల్ బెడ్ రూమ్ లను కూడా పరిశీలించి వివరాలను ఆరా తీశారు.అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేయాలని,మరమ్మతులు చేయాలన్నారు.వీలైనంత తొందరగా అర్హులైన పేదలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

# ఏబీవీపీ వికారాబాద్ నూతన టౌన్ కమిటీ ప్రకటన



**వికారాబాద్, ఆగస్టు 22, నేటి శుభోదయ :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ABVP) వికారాబాద్ ఆధ్వర్యంలో నూతన టౌన్ కమిటీని ప్రకటించారు. కార్యక్రమానికి పాలమూరు విభాగ్ సంఘటన కార్యదర్శి కాయం నవేంద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వికారాబాద్ టౌన్ సెక్రటరీగా దూస శివ సాయి, టౌన్ ప్రెసిడెంట్‌గా రాజు, వైస్ ప్రెసిడెంట్‌గా శివ కుమార్ సర్లను ఎన్నుకున్నారు. నూతన టౌన్ సెక్రటరీ దూస శివ సాయి మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తానని తెలిపారు. వికారాబాద్ పట్టణంలోని విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం ABVP ఆధ్వర్యంలో నిరంతరం పోరాటం చేస్తానన్నారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణతో పాటు విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారం జరిగే వరకు కృషి చేస్తానని పేర్కొన్నారు.తనకు అప్పగించిన బాధ్యతను పదవిగా కాకుండా విద్యార్థుల కోసం పనిచేసే అవకాశంగా భావిస్తున్నానని, విద్యార్థులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని శివ సాయి తెలిపారు. వికారాబాద్ పట్టణంలో ABVPను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు.కాయం నవేంద్ర మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన టౌన్ కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల సమస్యలపై నిరంతరం స్పందిస్తూ వారి గొంతుకగా ABVP ముందుండాలని ఆకాంక్షించారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో వికారాబాద్ పట్టణంలో విద్యార్థి సమస్యల పరిష్కారానికి మరింత చురుకుగా పనిచేసి ABVPను బలోపేతం చేయాలని సూచించారు.

# గజ్వేల్‌లో ఆర్డీవోకు బీజేపీ నాయకుల వినతి పత్రం

**- 22ఏ నిషేధిత భూముల జాబితా అక్రమాలపై సమగ్ర విచారణకు డిమాండ్**



**గజ్వేల్, ఆగస్టు 22, నేటి శుభోదయ :** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 22ఏ నిషేధిత భూముల జాబితా రూపకల్పనలో భారీ తప్పులు, అక్రమ చేర్పులు, అవకతవకలు జరిగాయని, దీనిపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గజ్వేల్ బీజేపీ నాయకులు శనివారం స్థానిక ఆర్డీవోకు వినతి పత్రం సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా 22ఏ జాబితాలో తప్పులు జరిగినట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్వయంగా అంగీకరించిన నేపథ్యంలో, సిద్దిపేట జిల్లాలో జరిగిన అక్రమాలపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని నాయకులు కోరారు. నిషేధిత భూముల జాబితాను తక్షణమే బహిరంగపరిచి, ప్రజలకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ శాఖలో జరిగిన ఈ భారీ తప్పిదాలకు నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని, ఈ డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లాలని వారు ఆర్డీవోను కోరారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి కొండడం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి మర్కంటి ఏగండ, బీజేపీ సీనియర్ నాయకులు యేల్లు రాం రెడ్డి, ఉప్పల మధుసూదన్, చిలువేరి జనార్ధన్ పాల్గొన్నారు. అలాగే బీజేపీ కౌన్సిలర్ రొట్టేల శ్రీనివాస్, కౌన్సిల్ సభ్యులు చేప్యాల వెంకట్ రెడ్డి, గజ్వేల్ పట్టణ ప్రధాన కార్యదర్శులు నాయిని సందీప్ కుమార్, మాడుగురి నరసింహ ముదిరాజ్, పట్టణ ఉపాధ్యక్షులు వడ్డేపల్లి ప్రసాద్, నాయకులు పేడ్యాల శ్రీనివాస్, సల్ల శ్రీనివాస్, మంద వెంకట్, గడియారం రాజేశ్వర్ చారి, ఆనంద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో షూ పంపిణీ



**మంథని, ఆగస్టు 22, నేటి శుభోదయ :** మంథని ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాల లో శనివారం ప్రభుత్వం ఉచితంగా విద్యార్థిని, విద్యార్థులకు బ్రేక్ ఫాస్టు ట్రయిల్ రన్ ప్రోగ్రాం ను పెద్దపల్లి నోడల్ అధికారి కల్పన పరిశీలించారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులకు షూస్ పంపిణి చేసారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి నోడల్ అధికారి మాట్లాడుతూ ప్రభుత్వం అందించే టెక్స్ట్ బుక్స్ , నోటుబుక్స్,షూస్,బ్యాగ్స్ ఉచిత భోజనం వంటి వాటిని ఉపయోగించుకొని ప్రతి రోజు కళాశాలకు వచ్చి అధ్యాపకులు బోదించే వాటిని శ్రద్దగా విని వృద్ధిలోకి రావాలని డ్రగ్స్ మద్యపానం వంటి వాటి జోలికి వెళ్లకుండా ఉండాలని, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఇంటర్మీడియట్ బోర్డు వారు ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి కల్పనా తో పాటు కళాశాల ప్రిన్సిపాల్ కే.ఉష, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జీఎస్ఐ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా ఎర్ర వినోద్ రెడ్డి



**ఎల్బీనగర్, ఆగస్టు 22, నేటి శుభోదయ :** ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలో నూతనంగా ఏర్పడిన జీఎస్ఐ డివిజన్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడిగా ఎర్ర వినోద్ రెడ్డి నియమితులయ్యారు.డివిజన్ల పునర్విభజనలో భాగంగా జీఎస్ఐ డివిజన్ నూతనంగా ఏర్పడగా, పార్టీ అధిష్టానం ఆయనను అధ్యక్షుడిగా నియమించింది.ఎర్ర వినోద్ రెడ్డి రాక్‌టౌన్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, స్థానికంగా తనదైన గుర్తింపు పొందారు. సామాజిక సేవలతో పాటు బీజేపీలో క్రియాశీలకంగా పనిచేస్తూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించారు. ఆయన సేవలను గుర్తించిన పార్టీ అధిష్టానం జీఎస్ఐ డివిజన్ అధ్యక్ష బాధ్యతలను అప్పగించింది.ఈ సందర్భంగా ఎర్ర వినోద్ రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి పార్టీ అధిష్టానం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి వాటిపై అవగాహన కల్పిస్తానన్నారు. డివిజన్‌లో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు.తనకు ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు,, రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, సామ రంగా రెడ్డి, చింతల సురేందర్ యాదవ్, మరియు ఇతర ఎల్బీ నగర్ నియోజకవర్గం బిజెపి నాయకులకు ఎర్ర వినోద్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# నో బ్యాగ్ డే సందర్భంగా విద్యార్థులకు విద్యా విహారయాత్ర



**మంథని, ఆగస్టు 212, నేటి శుభోదయ :** నాల్గవ శనివారం నో బ్యాగ్ డే సందర్భంగా మంథని జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల విద్యార్థులకు విద్యా విహారయాత్ర నిర్వహించారు. ఇందులో భాగంగా ఖమ్మంపల్లి గ్రామంలోని చారిత్రక సాంద్రెల్లి గుళ్లను విద్యార్థులు సందర్శించారు. ఆలయాల చారిత్రక నేపథ్యం, ప్రాముఖ్యత, విశిష్టతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.అనంతరం విద్యార్థులు తాడిచెర్ల ఓపెన్ కాస్ట్ గనిని సందర్శించారు. గనుల ప్రాముఖ్యత, బొగ్గు ఉత్పత్తి మరియు దేశ అభివృద్ధిలో గనుల పాత్ర గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. గనిలో ఉపయోగించే డంపర్లు, షవల్స్ పనిచేసే విధానాన్ని విద్యార్థులు ఆసక్తిగా పరిశీలించి ఆనందించారు.తదుపరి మానేరు బ్రిడ్జి వద్ద విద్యార్థులు ఉపాధ్యాయుల సమక్షంలో వంట చేసుకుని, అందరూ కలిసి భోజనం చేశారు. అనంతరం విద్యార్థులు వివిధ రకాల ఆటలు ఆడి ఉత్సాహంగా, ఆనందంగా గడిపారు.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు చరిత్ర, గనుల ప్రాధాన్యత, ప్రకృతి మరియు సామాజిక జీవన విధానాలపై ప్రత్యక్ష అవగాహన కలిగింది. పాఠ్యపుస్తకాలకు మాత్రమే పరిమితం కాకుండా, ప్రత్యక్ష అనుభవం ద్వారా నేర్చుకునేలా చేసిన ఈ నో బ్యాగ్ డే కార్యక్రమం విద్యార్థులకు ఎంతో విజ్ఞానదాయకంగా, ఆహ్లాదకరంగా నిలిచింది.ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మోసం శ్రీనివాస్ మరియు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు మార్గదర్శనం చేశారు.

# జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం పాదయాత్ర

- **బీపీఎల్ కోటాలో జర్నలిస్టులకు ఇళ్లు కేటాయించాలి**
- **కార్పొరేషన్ ఎన్నికలలోపు డిమాండ్లు పరిష్కరించాలి**
- **పరిష్కారం లేకుంటే ఆమరణ దీక్షకు సిద్ధం : టిడబ్ల్యూజేఎఫ్**




**ఖమ్మం, ఆగస్టు 22, నేటి శుభోదయ :** జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర కూసుమంచి మండల కేంద్రానికి చేరుకుంది. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు సోయబుల్లా ఖాన్ జన్మస్థలమైన సుబ్లేడ్ గ్రామం నుంచి ప్రారంభమైన పాదయాత్ర తిరుమలాయపాలెం మీదుగా కూసుమంచి మండల కేంద్రానికి చేరుకుంది.

**కలెక్టర్‌కు వినతిపత్రం**

అనంతరం కూసుమంచి తహసీల్దార్ కార్యాలయంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ కు జర్నలిస్టులు వినతిపత్రం సమర్పించారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యతో పాటు ఇతర డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు.

**కలెక్టర్‌తో ఖదీర్ మాట్లాడుతూ**

ఈ సందర్భంగా టిడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు ఖదీర్ కలెక్టర్‌తో మాట్లాడుతూ జర్నలిస్టులకు బీపీఎల్ కోటా కింద ఇళ్లను కేటాయించాలని కోరారు. జర్నలిస్టుల డిమాండ్లను కార్పొరేషన్ ఎన్నికలలోపు పరిష్కరించాలని కోరారు. సమస్యలను పరిష్కరించకపోతే మండల కేంద్రాలతో పాటు జిల్లా కేంద్రంలో ఆమరణ నిరాహార దీక్షకు సైతం సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

**ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా : కలెక్టర్ దివాకర టీఎస్**

జర్నలిస్టుల సమస్యలపై కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ జర్నలిస్టులు కోరుతున్న ఇళ్ల స్థలాల అంశం తన పరిధిలోకి రాదని తెలిపారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి జర్నలిస్టుల కోరికలు నెరవేర్చేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ పాదయాత్రలో టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు దుర్వాసాగర్, జిల్లా కోశాధికారి తేనే వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యులు గరిడేపల్లి వెంకటేశ్వర్లు, పానగల్ల నాగిరెడ్డి, పాలేరు నియోజకవర్గ కమిటీ సభ్యులు యాస లక్ష్మారెడ్డి, పెంద్ర అంజయ్య, పాలేరు నియోజకవర్గ విలేకరులు తదితరులు పాల్గొన్నారు.జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను ప్రభుత్వం ఇకనైనా పరిష్కరించి, ఏళ్లుగా ఎదురుచూస్తున్న జర్నలిస్టులకు న్యాయం చేయాలని టిడబ్ల్యూజేఎఫ్ నాయకులు కోరారు.

# జ్ఞాన దీపికలకు అడుగుజాడ

## - గట్టుఇప్పలపల్లిలో గ్రంథాలయ భవనానికి శంకుస్థాపన

- **గ్రంథాలయం ఏర్పాటుకు ఎంపీ డాక్టర్ మల్లు రవి కృషి**
- **(భేరా) సొసైటీ ఆధ్వర్యంలో గ్రంథాలయం ఏర్పాటు**
- **సర్పంచ్ జీనుకుంట్ల చంద్రశేఖర్**



**తలకొండపల్లి, ఆగస్టు 22, నేటి శుభోదయ :** తలకొండపల్లి మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లి గ్రామంలో నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి శనివారం భూమి పూజ, శంకుస్థాపన కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామాల్లో విద్యావ్యాప్తి, యువతకు ఉపాధి మార్గాల అన్వేషణకు గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లి గ్రామంలో భేరా (Bhera) సొసైటీ ఆధ్వర్యంలో,స్థానిక పార్లమెంట్ సభ్యులు (ఎంపీ) డాక్టర్ మల్లు రవి ప్రత్యేక సహకారంతో నిర్మించతలపెట్టిన నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి భూమి పూజ, శంకుస్థాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన గ్రామ సర్పంచ్ జినుకుంట్ల చంద్రశేఖర్, ఉపసర్పంచ్ అనిత విజయ్ కొబ్బరికాయ కొట్టి,శిలాఫలకాన్ని ఆవిష్కరించి నిర్మాణ పనులను అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు, నిరుద్యోగ యువతీ యువకులకు ఈ గ్రంథాలయం ఒక వరమని, దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భవన నిర్మాణానికి సహకరించిన ఎంపీ మల్లు రవికి, భేరా సొసైటీ ప్రతినిధులకు గ్రామస్తుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రేణు రెడ్డి,రాజశేఖర్, అశోక్ గౌడ్,ఆసియా బేగం, కోల శీనులతో పాటు కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి,యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శివ గౌడ్,ప్రముఖ నాయకులు మట్ట అంజయ్య, నరేంద్ర గౌడ్, బోయ కిషన్, పరమేష్, స్వామి,సాదిక్, రాజు, శంకర్, జీవ తదితర ముఖ్య నాయకులు,యువకులు,గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వెల్జాల్ లో వృద్ధురాలు భూమి కోసం దీక్ష

## -16వ రోజు బొజ్జమ్మ భూమి కోసం దీక్ష!



**తలకొండపల్లి, ఆగస్టు 22, నేటి శుభోదయ :** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామ ప్రజలు 16 వ రోజు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన చేపట్టారు.గ్రామానికి చెందిన ఆయిల్ బొజ్జమ్మ (భర్త వెంకటయ్య) తమ వారసుల భవిష్యత్తు కోసం ఎలాంటి స్వార్థం లేకుండా శేఖర్ గౌడ్, రవి గౌడ్‌లకు సాగు నిమిత్తం పొలాన్ని అప్పగించారు.కొందరు వ్యక్తులు అక్రమ మార్గాల్లో ఈ భూమిని తమ పేరిట పట్టా చేయించుకున్నారని ఆమె ఆరోపించారు.ప్రస్తుతం ఈ భూమి అసలు బాధితుల పేరిట లేకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నామని,తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకుని తమ భూమిని తమకు ఇప్పించాలని,బాధితుల పేరిట పట్టా నమోదు చేయాలని ఆమె కన్నీటిపర్యంతమయ్యారు.భూ బాధితురాలు బొజ్జమ్మకు వెల్జాల్ గ్రామ ప్రజలు,యువకులు,పెద్దలు పూర్తి మద్దతు ప్రకటించారు.16వ రోజు బొజ్జమ్మ దీక్షకు మద్దతుగా గ్రామంలోని అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు సుల్తాన్ (రామ్) ఆధ్వర్యంలో బుధవారం బొజ్జమ్మకు మద్దతూ గా దీక్షలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాఘవేంద్రర్ గౌడ్ మాట్లాడుతూ...అక్రమంగా పట్టా చేసిన భూమిని వెంటనే రద్దు చేసి,బాధితుల పేరిట నమోదు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు వెనకడుగు వేసేది లేదని,నిరసనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో గ్రామంలో ఎవరికి ఇలాంటి అన్యాయం జరిగినా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.భూమిని అక్రమంగా పట్టా చేసుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.గ్రామ ప్రజలంతా న్యాయం వైపు నిలబడి బాధితులకు అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.ఉన్నతాధికారులు విచారణ జరపాలి:ఈ భూ వ్యవహారంపై రెవెన్యూ (ఎమ్మార్వో), పోలీస్ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమగ్ర విచారణ జరపాలని నిరసనకారులు డిమాండ్ చేశారు.బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుని,బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు."న్యాయం జరిగే వరకు మా పోరాటం ఆగదు" అంటూ గ్రామ ప్రజలు ముక్తకంఠంతో నినదించారు.ఈ కార్యక్రమంలో గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడు తిరుమణి రాఘవేందర్ గౌడ్, బొమ్మ శంకరయ్య, రాచమల్ల భాస్కర్, తిరుపతి, రవి గౌడ్, యాదయ్య గౌడ్,సాయి, సుల్తాన్, శంకర్, శేఖర్, లచ్చయ్య గౌడ్, అనిల్ గౌడ్,వెంకటయ్య, గోపాల్,శంకర్, యాదగిరి, నరసింహ,శ్రీను,రవి,మహేష్,రాజు,వెంకటయ్య,తదితరులు పాల్గొన్నారు

# మంథనిలో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**





**మంథని, ఆగస్టు 22, నేటి శుభోదయ :** మంథనిలో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. ఆగస్టు 24న రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి చేతుల మీదుగా కిచెన్‌ను ప్రారంభించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు.మంథని పట్టణంలోని గంగాపురి ప్రాంతంలో ఇస్కాన్ సంస్థ, హరే రామ హరే కృష్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను శనివారం కలెక్టర్ పరిశీలించారు. వంటశాల, ఆహార తయారీ, నిల్వ, తాగునీరు, విద్యుత్, పరిశుభ్రత తదితర సౌకర్యాలను పరిశీలించారు.కిచెన్‌లో పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన ఆహారాన్ని తయారు చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రారంభోత్సవానికి వచ్చే ప్రజాప్రతినిధులు, అధికారులు, అతిథులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పార్కింగ్, భద్రత, విద్యుత్, తాగునీరు తదితర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మంథని ఆర్డీవో సురేష్, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ సయేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మనోహర్, తహసీల్దార్ ఆరిపోద్దిన్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

**- సోషల్ మీడియా కోఆర్డినేటర్ కొమ్ము శ్రీనివాస్**



**వికారాబాద్, ఆగస్టు 21, నేటి శుభోదయ :** అనారోగ్య సమస్యలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్ఎఫ్) ఎంతో అండగా నిలుస్తోందని సోషల్ మీడియా మండల కో–ఆర్డినేటర్ కొమ్ము శ్రీనివాస్ అన్నారు. కుల్కచర్లలో వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన పలువురు బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కొమ్ము శ్రీనివాస్ మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు వైద్య ఖర్చులు భారంగా మారుతున్న నేపథ్యంలో ప్రభుత్వం అందిస్తున్న సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థికంగా ఎంతో ఉపశమనం కలిగిస్తోందన్నారు. అనారోగ్య కారణాలతో ఏ కుటుంబం ఆర్థికంగా కుదేలుకాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ సహాయాన్ని అందిస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సీఎంఆర్ఎఫ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, కార్యకర్తలు, సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

# వికలాంగులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

**- ఎల్.బి.నగర్ శాసనసభ్యులు శ్రీ దేవిరెడ్డి సుధీర్ రెడ్డి**



**ఎల్బీనగర్, ఆగస్టు 22, నేటి శుభోదయ :** అనారోగ్య సమస్యలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్ఎఫ్) ఎంతో అండగా నిలుస్తోందని సోషల్ మీడియా మండల కో–ఆర్డినేటర్ కొమ్ము శ్రీనివాస్ అన్నారు. కుల్కచర్లలో వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన పలువురు బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కొమ్ము శ్రీనివాస్ మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు వైద్య ఖర్చులు భారంగా మారుతున్న నేపథ్యంలో ప్రభుత్వం అందిస్తున్న సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థికంగా ఎంతో ఉపశమనం కలిగిస్తోందన్నారు. అనారోగ్య కారణాలతో ఏ కుటుంబం ఆర్థికంగా కుదేలుకాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ సహాయాన్ని అందిస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సీఎంఆర్ఎఫ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, కార్యకర్తలు, సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

# వైరల్ జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- కుల్కచర్ల వైద్యాధికారి కిరణ్ కుమార్ గౌడ్**



**వికారాబాద్, ఆగస్టు 22, నేటి శుభోదయ :** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల: మండలంలో వ్యాపిస్తున్న వైరల్ జ్వరాలు, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కుల్కచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కిరణ్ కుమార్ గౌడ్ సూచించారు. ముఖ్యంగా డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా వంటి తీవ్రమైన సీజనల్ వ్యాధుల పట్ల ముందస్తు జాగ్రత్తలు పాటించడం చాలా అవసరమని స్పష్టం చేశారు.కుల్కచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైరల్ ఫీవర్ బాధితులకు అవసరమైన మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు ప్రజలు కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. జ్వరం తీవ్రంగా ఉంటే ఎలాంటి స్వయం వైద్యం చేసుకోకుండా, నిర్లక్ష్యం వహించకుండా వెంటనే ప్రభుత్వాసుపత్రికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు.మరోవైపు గ్రామాల్లో ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజా ఆరోగ్యం విషయమై విధుల పట్ల నిర్లక్ష్యం వహించే వైద్య సిబ్బందిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

**- సీఐ జానకిరామ్ రెడ్డి**

- ద్విచక్ర వాహనదారులకు ఉచిత హెల్మెట్ల పంపిణీమరణానంతరం అవయవ దానం చేస్తా
- మాజీ బీజేపీ మండల అధ్యక్షుడు దోర్నాల వెంకటేశ్వర్ రెడ్డి





**తలకొండపల్లి, ఆగస్టు 22, నేటి శుభోదయ :** ద్విచక్ర వాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు ప్రాణ రక్షణ కోసం తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తలకొండపల్లి సీఐ జానకిరామ్ రెడ్డి సూచించారు.తలకొండపల్లి మండల మాజీ బీజేపీ మండల అధ్యక్షుడు, ప్రముఖ సామాజికవేత్త, దాత దోర్నాల వెంకటేశ్వర్ రెడ్డి నేడు జరుపుకోనున్న తన పుట్టినరోజును పురస్కరించుకుని శనివారం స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో వాహనదారులకు 50 మంది కి ఉచిత హెల్మెట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.సీఐ జానకిరామ్ రెడ్డి ఆధ్వర్యంలో దాత దోర్నాల వెంకటేశ్వర రెడ్డి సౌజన్యంతో ఈ హెల్మెట్లను అందజేశారు.ఈ సందర్భంగా దాత దోర్నాల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ..వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితం గా పాటించాలని, బైక్ నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని కోరారు. ఇదే సమయంలో ఆయన తన సామాజిక బాధ్యతను చాటుకుం టూ.. తన మరణానంతరం సమాజానికి ఉపయోగపడేలా దేహాన్ని, అవయవాలను దానం చేయనున్నట్లు ప్రకటించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. అనంతరం సీఐ జానకిరామ్ రెడ్డి మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదా ల నివారణకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని, దాత వెంకటేశ్వర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఇలాంటి మంచి కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. అనంతరం తలకొండపల్లి జర్నలిస్టులందరికీ హెల్మెట్లు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై శేఖర్‌తో పాటు వివిధ గ్రామల సర్పంచులు, బిజెపి నాయకులు, వాహనదారులు, తలకొండపల్లి మండల జర్నలిస్టులు,తదితరులు పాల్గొన్నారు.

# దోనూర్ బోనాలకు ప్రత్యేక ప్రాధాన్యం





**మిడ్జిల్, ఆగస్టు 22, నేటి శుభోదయ :** మిడ్జిల్ మండలం దోనూర్ గ్రామంలో మైసమ్మ, పోచమ్మ దేవతల బోనాల పండుగను ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు ఘనంగా నిర్వహించేందుకు గ్రామస్థులు ఏర్పాట్లు చేస్తున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ వేడుకలకు దోనూర్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. బోనాల సందర్భంగా ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించి, అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించనున్నారు.పండుగ రెండో రోజు బోనాలతో పాటు సుమారు 100 ఎడ్లబండ్లతో అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు తరలిరానున్నారు. ఈ సందర్భంగా దాదాపు 5 వేల మంది వరకు భక్తులు పాల్గొనే అవకాశం ఉందని గ్రామస్థులు చెబుతున్నారు. ఎడ్లబండ్ల ఊరేగింపు, బోనాల సమర్పణ, ప్రత్యేక పూజలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొననుంది.శిలగా మారిన వ్యక్తి కథతో ప్రత్యేకతదోనూర్ మైసమ్మ అమ్మవారి ఆలయానికి స్థానికంగా ఓ ప్రత్యేకమైన చరిత్ర ఉందని గ్రామస్థులు చెబుతున్నారు. అమ్మవారి కోరిక మేరకు ఓ వ్యక్తి శిలగా మారినట్లు తరతరాలుగా కథ ప్రచారంలో ఉందని పేర్కొంటున్నారు. ఈ విశ్వాసం కారణంగానే దోనూర్ మైసమ్మ బోనాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడిందని భక్తులు భావిస్తున్నారు.బోనాల పండుగ సందర్భంగా భక్తులు తమ మొక్కులు చెల్లించుకోవడంతో పాటు కుటుంబ సమేతంగా అమ్మవార్లను దర్శించుకుని ఆశీస్సులు పొందనున్నారు. పండుగను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. దోనూర్ బోనాల వేడుకలు ఈసారి ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

# తునికి ఖల్సాలో వయ్యారిభామ కలుపు మొక్కల నిర్మూలన కార్యక్రమం



**వర్గల్, ఆగస్టు 22, నేటి శుభోదయ :** మానవాళి ఆరోగ్యానికి, పంటలకు, పశుసంపదకు తీవ్ర చేటు కలిగించే వయ్యారిభామ (పార్థీనియం) కలుపు మొక్కల నిర్మూలనలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు పిలుపునిచ్చారు. శనివారం వర్గల్ మండలం తునికి ఖల్సా గ్రామంలో గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో (RAWE) ఆర్ఏడబ్ల్యూఈ భాగంగా వర్సిటీ విద్యార్థులు కలుపు మొక్కల నిర్మూలనపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. గ్రామ సర్పంచ్ కొండగల్ల గణేష్, ఉపసర్పంచ్ లక్ష్మి కొండల్ రెడ్డి, పాలకవర్గ సభ్యుల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. వర్సిటీ విద్యార్థుల బృందం వెంకటహర్షిని, లావణ్య, హర్షద, ప్రవీణ, అనూష, భార్గవి స్థానిక జెడ్పిహెచ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. శ్రీలక్ష్మి , ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులతో కలిసి సామూహికంగా పార్థీనియం మొక్కలను నిర్మూలించారు. పాఠశాల ఆవరణలోని వివిధ ప్రదేశాల్లో విస్తరించి ఉన్న కలుపు మొక్కలను పీకి వేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ విద్యార్థులు మాట్లాడుతూ వయ్యారిభామ మొక్కల వల్ల మానవులకు అలర్జీలు, శ్వాసకోశ వ్యాధులు (ఆస్తమా వంటివి) వస్తాయని హెచ్చరించారు. ఇవి పంటల దిగుబడిని తగ్గించడమే కాకుండా, పశుసంపదకు కూడా ఎంతో నష్టం కలిగిస్తాయని పేర్కొన్నారు. ఈ మొక్కలను చిన్న దశలోనే గుర్తించి తొలగించాలని, విత్తనాలు పడి మరింత వ్యాప్తి చెందకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు.

# డంప్ యార్డులో చెత్త వేసిన వ్యక్తికి రూ.10 వేల జరిమానా



**మంథని, ఆగస్టు 22, నేటి శుభోదయ :** మంథని మున్సిపాలిటీ పరిధిలోని డంప్ యార్డులో నిబంధనలకు విరుద్ధంగా చెత్త వేసిన వ్యక్తికి మున్సిపల్ అధికారులు రూ.10 వేల జరిమానా విధించారు. పట్టణంలో పారి శుధ్యాన్ని కాపాడేందుకు నిర్దేశించిన ప్రాంతాల్లోనే చెత్త వేయాలని అధికారులు సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం, మున్సిపల్ నిబంధనలను ఉల్లం ఘించడం చేస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానాలు విధిస్తామని హెచ్చరిం చారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలు బాధ్యతగా వ్యవహరించి మున్సిపాలిటీకి సహకరించాలని కమిషనర్ కోరారు.

# వారాహి సిక్స్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్



**వనస్థలిపురం, ఆగస్టు 22, నేటి శుభోదయ :** వనస్థలిపురం లో మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు శ్రీ ఈటల రాజేందర్, బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి, మరియు మనసురాబాద్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి, హయత్ నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి వారాహి సిక్స్ నూతన ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వారాహి సిక్స్ సంస్థ ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. స్థానికంగా ఉపాధి అవకాశాలను పెంపొందించే ఇలాంటి వ్యాపార, సేవా సంస్థల ఏర్పాటు ఎంతో అభినందనీయమని ఆయన కొనియాడారు.కస్టమర్ల నమ్మకాన్ని పెంచుకోవడంలో సంస్థ నిరంతరం విజయవంతంగా ముందుకు సాగాలని ఆయన యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ ఘనమైన ప్రారంభోత్సవ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు, ముఖ్య నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు, అభిమానులు పాల్గొన్నారు.

# చేయూత పింఛన్లకు ఆగస్టు 30 వరకు దరఖాస్తులు




**మంథని, ఆగస్టు 22, నేటి శుభోదయ :** మంథని మున్సిపాలిటీ పరిధిలో చేయూత సామాజిక భద్రత పింఛన్లకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా, డయాలసిస్ బాధితులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.అర్హులైన వారు ఆగస్టు 30లోపు అవసరమైన ధ్రువపత్రాలతో మున్సిపల్ కార్యాలయంలో సంబంధిత సిబ్బందిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. చివరి తేదీ వరకు వేచి ఉండకుండా ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని కోరారు.అందిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు అధికారులు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో అర్హత ఉన్నప్పటికీ ఇప్పటివరకు పింఛన్ పొందని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్, కమిషనర్ కోరారు.

# వీవో బిల్డింగ్ పనుల పరిశీలన



**ఏన్కూరు, ఆగస్టు 22, నేటి శుభోదయ :** ఏన్కూర్ మండల పరిధిలోని ఆరికాయల పాడు గ్రామంలో నిర్మిస్తున్న వీవో బిల్డింగ్ నిర్మాణ పనులను శనివారం ఏఈ సూర్యనారాయణ పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీ లించిన ఆయన, పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించారు. స్వయంగా అక్కడే ఉండి నిర్మాణ పనులను పర్యవేక్షిస్తూ, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచిస్తున్నారు. పనులు పూర్తయ్యే వరకు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని తెలిపారు.

# అమ్మాయిపల్లి గ్రామంలో శిథిలావస్థలో ఉన్న వాటర్ ట్యాంక్ పరిశీలించిన అధికారులు

- గ్రామ సర్పంచ్ కవిత ప్రభంజన్ గౌడు
- ఉప సర్పంచ్ మాధవి మాధవరెడ్డి





**చిన్నంబావి, ఆగస్టు 22, నేటి శుభోదయ :** చిన్నంబావి మండల పరిధిలోని అమ్మాయి పల్లి గ్రామంలో ఎస్సీ కాలనీకి ఆనుకొని మంచినీటి వాటర్ ట్యాంక్ దాదాపు 30ఏండ్ల క్రిందట నిర్మించిన ట్యాంక్ శితిలావస్థ పరిస్థితికి చేరుకుంది. స్థానిక మంత్రివర్యుల జూపల్లి కృష్ణారావు దృష్టికి గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోహన్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ పెద్దలు, మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. తక్షణమే స్పందించి సంబంధిత డిపార్ట్మెంట్ వారికి ఆదేశాలు ఇవ్వడంతో గ్రామానికి వారు వచ్చి పరిశీలించడం జరిగింది. వాటర్ ట్యాంక్ ను పరిశీ లించుట కొరకు ఆర్డబ్ల్యూఎస్ డిపార్ట్మెంట్ శంకర్ అమ్మాయి పల్లి గ్రామానికి వచ్చి మిషన్ల ద్వారా క్యూసి పరిశీలన చేశారు. మంత్రివర్యుల సహాయ సహకారాలతో గ్రామ సర్పంచ్, ఆర్డబ్ల్యూఎస్ డిపార్ట్మెంట్ వాళ్లకి తొందరగా సాంక్షన్ వచ్చేలా కృషి చేయాలని ప్రత్యేకంగా తెలియజేశారు. గ్రామ సమస్యలపై సర్పంచ్ తక్షణ స్పందనతో గ్రామంలోన ప్రజలకు ఎలాంటి సమస్యలు రాకుండా చేస్తున్నందున గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇట్టి కార్యక్రమంలో గ్రామపంచాయతీ సెక్రటరీ జైపాల్ రెడ్డి, గ్రామ సర్పంచ్ మాదగౌని కవిత ప్రభంజన్ గౌడ్, ఉపసర్పంచ్ మాధవి మాధవ రెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోహన్ రెడ్డి, వార్డు మెంబర్లు దర్గయ్య, మహేశ్వరమ్మ సత్య రెడ్డి, పావని కవీందర్ గౌడ్, అల్లేన్న గౌడ్, గ్రామ పెద్దలు యువ నాయకులు వెంకటేష్, శ్యామ్, తారాచంద్ గౌడు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పాలకులను నిలదీసే పత్రికా స్వేచ్ఛను స్వాగతిస్తాం

## - ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**రాజేంద్రనగర్, ఆగస్టు 22, నేటి శుభోదయ :** ప్రజాస్వామ్య మనుగడకు పాలకులను ప్రశ్నించే పత్రికా స్వేచ్ఛ అత్యంత కీలకమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. విమర్శలను స్వీకరించే ధైర్యం ప్రభుత్వాలకు ఉండాలని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా ఎనిమిది పత్రికా మండళ్ల ప్రతి నిధులు ఏకతాటిపైకి వచ్చి హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన పత్రికా మండళ్ల సమాఖ్యను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. హైదరాబాద్ పత్రికా మండలి ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని ఐఏఎస్ అధికారుల మండలిలో శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్య క్రమంలో ది హిందూ పత్రిక మాజీ సంపాదకుడు ఎన్. రామ్, తెలంగాణ మీడియా అకాడమీ అధ్యక్షుడు కె. శ్రీనివాసరెడ్డి, భారత పత్రికా మండలి అధ్యక్షుడు సంగీత బారోచ్, కరవాన్ పత్రిక సంపాదకుడు అనంతనాథ్, పత్రికా మండళ్ల సమాఖ్య నుంచి గౌతమ్ లహరి, హైదరాబాద్ పత్రికా మండలి అధ్యక్షుడు విజయ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వి. రమేష్ తది తరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ, భారతీయ పాత్రికేయ వారసత్వాన్ని, ప్రస్తుత సవాళ్లను సోదాహరణంగా వివరించారు. వివక్షను ప్రశ్నించాల్సిన బాధ్యత పత్రికలదే అని చెప్పారు. సమాజంలో జరుగుతున్న ఘటనలను కేవలం నివేదిం చడమే కాకుండా, వాటి అంతరార్థాన్ని ప్రశ్నించాల్సిన బాధ్యత పాత్రి కేయంపై ఉందని భట్టి స్పష్టం చేశారు. ఇటీవల కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హల్ద్వానీలోని రామ్ లీలా మైదానంలో ప్రసం గించిన రెండు రోజుల తర్వాత, కొందరు అక్కడ శుద్ధీకరణ కార్యక్రమం నిర్వహించడాన్ని ఆయన ప్రశ్నించారు. ఎనిమిది దశాబ్దాల స్వాతంత్ర్యం తర్వాత కూడా ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడి పట్ల బహిరంగంగా ఇలా జరిగితే, దేశంలో సమానత్వం, గౌరవం ఏ స్థాయిలో ఉన్నాయో ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చూపిన మార్గంలో మనం ఇంకా ఎంత దూరం ప్రయా ణించాలో ఈ ఘటన తెలియజేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయో ద్యమంలో పత్రికలది చెరగని ముద్ర అని, భారతదేశ నిర్మాణంలో పాత్రికేయం ఒక అంతర్భాగమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గుర్తు చేశారు. పాత్రికేయం అంటే కేవలం వార్తలు రాయడం కాదని, పౌరులను తీర్చిదిద్దడమని ఆయన చెప్పారు. యంగ్ ఇండియా, నవజీవన్, హరిజన్ పత్రికల ద్వారా జాతిపిత మహాత్మా గాంధీ ప్రజలను స్వాతంత్ర్యోద్యమం వైపు మళ్లించారని అన్నారు. మూక్ నాయక్, బహిష్కృత భారత్ వంటి పత్రికలను బాబాసాహెబ్ అంబేద్కర్ స్థాపించి అణగారిన వర్గాలకు గొంతుకనిచ్చారని అన్నారు. కేసరి, మరాఠా పత్రికల ద్వారా లోకమాన్య బాలగంగాధర్ తిలక్ వలస పాలకులను సవాలు చేశారని అన్నారు. దాదాభాయ్ నౌరోజీ, మౌలానా అబుల్ కలాం ఆజాద్ లాంటి వారంతా పత్రికలను సామాజిక, రాజకీయ సంస్కరణలకు ఆయుధాలుగా మలి చారని ఆయన కొనియాడారు. ఆ కాలంలో అమృత బజార్ పత్రిక, ది హిందూ వంటివి ప్రజల గొంతుకలుగా నిలిచాయని చెప్పారు. ప్రజా స్వామ్యంలో పాలకులకు, పత్రికలకు మధ్య ఉండాల్సిన సంబంధాన్ని ఒక చారిత్రక సంఘటనతో ఉప ముఖ్యమంత్రి వివరించారు. 1948లో శంకర్స్ వీక్లీలో తనను నిరంతరం వ్యంగ్య చిత్రాలతో విమర్శించే శంకర్ తో అప్పటి ప్రధాని నెహ్రూ "నన్ను కూడా విడిచిపెట్టవద్దు, శంకర్" అన్న మాటలను భట్టి గుర్తుచేశారు. ఒకప్పుడు పత్రికా సంపాదకుడి పదవికి దేశంలో రెండో అత్యంత ముఖ్యమైన స్థానం ఉండేదని, రామ్ నాథ్ గోయెంకా లాంటి యజమానులు ప్రభుత్వాలను సైతం సవాలు చేసేవారని ఆయన అన్నారు. నేటి వార్తా సంస్థలు కేవలం లాభనష్టాల పట్టికలకు, వాణిజ్య ప్రయోజనాలకు పరిమితం కాకుండా ఆనాటి విశ్వసనీయతను నిలబెట్టుకోవాలని పిలుపునిచ్చారు. సామాజిక మాధ్యమాలు భావప్ర కటనా స్వేచ్ఛను విస్తృతం చేసినప్పటికీ, స్వేచ్ఛ అంటే బాధ్యతారాహిత్యం కాదని ఆయన హితవు పలికారు. "నా పిడికిలిని ఊపే హక్కు, అది నీ ముక్కు వద్దకు చేరే వరకు మాత్రమే" అన్న సామెతను గుర్తు చేస్తూ, ఒకరి ప్రతిష్టను దెబ్బతీసే అనుమతిగా భావప్రకటనా స్వేచ్ఛ మారకూడదన్నారు. కృత్రిమ మేధ, గొంతు అనుకరణ వంటి సాంకేతికతలతో పుకార్లు దేశమంతా వ్యాపిస్తున్న ఈ కాలంలో, పాత్రికేయులకు అసలైన ఆస్తి విశ్వ సనీయత మాత్రమేనని ఉద్ఘాటించారు. కొత్తగా ఏర్పాటైన పత్రికా మండళ్ల సమాఖ్య కేవలం ఒక సంస్థగా మిగిలిపోకుండా, పాత్రికేయుల భద్రతను, వృత్తిపరమైన ప్రమాణాలను కాపాడే బలమైన వ్యవస్థగా ఎదగాలని ఉప ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. గ్రామీణ స్థాయిలో, జిల్లాల్లో పనిచేసే విలే కరుల సంక్షేమంపై సమాఖ్య ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయుడు లేకపోయినా, ఆసుపత్రిలో వైద్యుడు లేకపోయినా, పౌరులు ఇబ్బందుల్లో ఉన్నా ప్రభుత్వానికి ముందుగా తెలిసేది జిల్లా విలే కరుల ద్వారానే అని, వారే ప్రభుత్వానికి అత్యుత్తమ ముందస్తు హెచ్చరిక వ్యవస్థ అని ఆయన కొనియాడారు. మనసులోని మాటను నిర్భయంగా వ్యక్తపరిచే స్వేచ్ఛ తెలంగాణ గడ్డ స్వభావంలోనే ఉందని, తమ ప్రభుత్వం ఆ సంప్రదాయాన్ని పూర్తిగా గౌరవిస్తుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. నెహ్రూ చెప్పినట్లుగానే "మమ్మల్ని కూడా విడిచిపెట్టవద్దు, స్వేచ్ఛగా మాట్లాడండి, స్వేచ్ఛగా ప్రశ్నించండి. ఆ విమర్శలను వినే ధైర్యం అధికారంలో ఉన్న మాకు ఉంది" అని ఆయన విలేకరులకు భరోసా ఇచ్చారని అన్నారు. ఈ కాలంలో సమాచార కొరత లేదని, నమ్మకం కొరత ఉందని, అందరూ ప్రచురించగలిగే పరిస్థితుల్లో విలేకరి వద్ద అత్యంత విలువైన ఆస్తి ముద్రణా యంత్రం కాదని, విశ్వసనీయత అని భట్టి విక్రమార్క అన్నారు. పాత్రికేయాన్ని రక్షించాలంటే విలేకరులను కూడా రక్షించాల్సిన అవసరం ఉందన్నారు. విలేకరుల భద్రత, గౌరవం, ఉద్యోగ పరిస్థితులు, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సమాఖ్యను కోరారు. ముఖ్యంగా జిల్లా, చిన్న పట్టణాల్లో పనిచేస్తున్న విలేకరుల సమస్యలను పట్టించుకోవాలని సూచించారు. గ్రామీణ, జిల్లా స్థాయి విలేకరులు ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తు న్నారని చెప్పారు. పాఠశాలలో ఉపాధ్యాయులు లేకపోవడం, ఆసుపత్రుల్లో వైద్యులు లేకపోవడం, సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు కాకపోవడం వంటి అంశాలను ప్రభుత్వానికి ముందుగా తెలియజేసేది తరచుగా స్థానిక విలేకరులేనన్నారు. ప్రభుత్వం వినడానికి సిద్ధంగా ఉంటే, మంచి విలేకరి ప్రభుత్వానికి అత్యుత్తమ ముందస్తు హెచ్చరిక వ్యవస్థ వంటివారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల స్వభావంలోనే స్వేచ్ఛగా తమ అభిప్రా యాలను వ్యక్తం చేసే సంప్రదాయం ఉందని భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ ఉద్యమాలు, సాహిత్యం, సంస్కృతిపై ఈ స్వభావం ప్రభావం చూపిందని తెలిపారు. భావ ప్రకటనా స్వేచ్ఛకు తెలంగాణలో ఎంతో ప్రాధాన్యత ఉందని, తమతో విభేదించే గొంతుకలను వినే ధైర్యం ప్రజా జీవితంలో ఉన్నవారికి ఉండాలని అన్నారు. కొత్తగా ఏర్పడిన సమాఖ్య కేవలం మరో సంస్థగా కాకుండా ఒక బలమైన సంస్థగా ఎదగాలని ఆకాం క్షించారు. విలేకరుల హక్కులు, సంక్షేమం, వృత్తి ప్రమాణాలు, పత్రికా స్వేచ్ఛ పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. అధికారంలో ఉన్న వారిని వదలకండి, అదే సమయంలో మీ వృత్తి ప్రమాణాలను కూడా వద లకండి. మమ్మల్ని జవాబుదారీగా ఉంచండి. మిమ్మల్ని మీరు మీ ప్రమా ణాలకు జవాబుదారీగా ఉంచుకోండి. ఈ రెండింటి ప్రయోజనం చివరికి పౌరుడికే దక్కాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. పత్రికా మండళ్ల సమాఖ్య విజయవంతంగా ముందుకు సాగాలని, దేశవ్యాప్తంగా విలేకరుల ఐక్యతకు, సంక్షేమానికి, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు వేదికగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. పత్రికా మండలి స్థలాన్ని కేటాయించేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని భట్టి విక్రమార్క ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ది హిందూ పత్రిక మాజీ సంపాదకుడు రామ్ మాట్లాడుతూ దేశంలోని పత్రికా మండళ్లు సమిష్టిగా సమాఖ్యగా ఆవిర్భవించడం విలేకరులు తమ గొంతును బలంగా వినిపించేందుకు ఒక వేదిక ఏర్పడిందన్నారు. దేశవ్యాప్తంగా విలేకరులపై దాడులు విపరీతంగా పెరిగాయని రామ్ ఆందోళన వ్యక్తం చేశారు. విలేకరుల పక్షాన న్యాయ పోరాటం చేయడానికి కపిల్ సిబల్ ఉచితంగా న్యాయ సాయం చేయ డానికి ముందుకు వచ్చారని ఆయన చెప్పారు. ప్రస్తుతం ఎనిమిది పత్రికా మండళ్లు ఈ సమాఖ్యలో భాగస్వామి కాగా చెన్నై, బెంగళూరు, తిరువనం తపురం మండళ్లు సమాఖ్యలో చేరుతున్నాయి. ప్రపంచ ఛాయాచిత్ర దినోత్సవం సందర్భంగా విజేతలకు జ్ఞాపిక, నగదు బహుమతితో సహా పురస్కారాలను ముఖ్య అతిథులు అందజేశారు. ఢిల్లీ, కోల్ కతా, త్రిపుర, మధ్యప్రదేశ్, ముంబై, అహ్మదాబాద్, చెన్నై, హైదరాబాద్ పత్రికా మండళ్ల ప్రతినిధులు సహా హైదరాబాద్ పత్రికా మండలి ఉపాధ్యక్షులు ఏ. రాజేష్, అరుణ అత్తలూరి, సంయుక్త కార్యదర్శులు చిలుకూరి హరిప్రసాద్, వర్దెల్లి బాపూరావు, కోశాధికారి రమేష్ వైట్ల, కార్యవర్గ సభ్యులు ఎన్. శ్రీనివాస్ రెడ్డి, ఉమాదేవి, ముత్యాల సత్తిబాబు, అమిత్ బట్టు, రచన ముదుంబై, వనం నాగరాజు, మర్యాద రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# అంతా నిర్లక్ష్యం...?

- నరికారు అర్ధరాత్రి మళ్లీ అక్కడే పెట్టారు..!
- చరవానికి స్పందించని సెక్రటరీ
- టేకు దుంగలు అక్కడే పెట్టి పరార్..!
- సెక్రటరీ స్టేషన్లో ఫిర్యాదు చేశారు - ఎంపీడీవో
- మమ్మల్ని సంప్రదించలేదు - ఫారెస్ట్ శాఖ
- చట్టరీత్యా చర్యలు ఉంటాయి - ఎస్సై
- ప్రభుత్వ సొమ్ములపై నిర్లక్ష్యత వీడని అధికారులు
- టేకు చెట్లపై ఎమ్మార్వో ప్రత్యేక శ్రద్ధ తీసుకొనున్నారా...?
- నిఘా వ్యవస్థకే దొరకని టేకు దుంగల ముఠా..!






**ఖమ్మం, ఆగస్టు 22, నేటి శుభోదయ :** గత కొన్ని రోజుల క్రితం అధికారిక ప్రభుత్వ సెలవు దినాల్లో ఏకంగా పెంట్లం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉన్న టేకు చెట్లను మాయం చేసిన ఘటన అనే పత్రిక కథనాల్లో సంచలనంగా మారింది.అర్ధరాత్రి గుట్టు సప్పుడు కాకుండా యంత్రాలను ఉపయోగించి చెట్లను నరికారు అన్న వాస్తవాలను కూడా స్థానిక విశ్లేషకులు బహిరంగంగా ప్రస్తుతం కూడా చర్చలు కొనసాగిస్తున్నారు. ఎవరు నరికారు ఎందుకు నరికారో తెలియదు కానీపత్రికా కథనంలో ప్రచురించిన కథనాలకు అధికారులు ఒక్క అడుగు ముందుకు వేయడంతో అన్నపురెడ్డిపల్లి మండలంలోని పెంట్లం గ్రామపంచాయతీ పరిధిలో టేకు చెట్లు నరికిన దుండగులకు వెన్నులో వణుకు పుట్టిందో ఏమో కానీ గుట్టు సప్పుడు కాకుండా అర్ధరాత్రి టేకు చెట్లను యధాస్థితిలో పడవేసి పారిపోయారు, అనే సందర్భాలు కూడా ప్రస్తుతం పెంట్లం గ్రామపంచాయతీ పరిధిలో చర్చిని అంశం అయ్యాయి. ఒకసారి స్పందించిన పెంట్లం పంచాయతీ కార్యదర్శి మళ్లీ మళ్లీ స్పందించిన సందర్భాలు టేకు చెట్ల దొంగలపై శూన్యంగానే ఉండి పోయాయి. అన్నపురెడ్డిపల్లి ఎంపీడీవో మాత్రం పెంట్లం గ్రామ పంచాయతీ కార్యదర్శి అన్నపురెడ్డిపల్లి స్థానిక ఠాణ లో ఫిర్యాదు చేశారని పోలీసు వ్యవస్థ ప్రత్యేక పర్యవేక్షణలో ఉందని, సుమారుగా పెంట్లం గ్రామ పంచాయతీ కార్యాలయంలో పది చెట్లు వరకు ఉన్నాయని అందులో కొన్ని టేకు చెట్లు ఉన్నాయని ఒకటి నరికిన వారు మరలా వస్తారని, వారు వస్తే ఖచ్చితంగా పట్టుకుంటామని హామీలిస్తున్నారు. పట్టుకునే మాట దేవుడి ఎరువు గాని ప్రస్తుతం నరికిన దుండగులును కనిపెట్టలేకపోవడం బాధాకరంగా ఉందని స్థానికులు భావుద్వేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం చెట్లను నరకాలు అంటే కచ్చితంగా అయినా అనుమతులు ఉండాలని, అది ఎంత వాటికైనా కచ్చిత పరిణామాలు అనువార్యంగానే కావాలని ఫారెస్ట్ శాఖ చెప్పుకొస్తున్నారు. ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలంలో పెంట్లం గ్రామపంచాయతీలో టేకు చెట్లు నరికిన ఘటనపై ఫారెస్ట్ శాఖకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని, మండల ప్రజా పరిషత్ అధికారి సమక్షంలో స్టేషన్లో ఫిర్యాదు చేశారని డిప్యూటీ రేంజర్ తెలిపారు. మండలంలోని కీలక పాత్ర వహించే రెవెన్యూ శాఖ తుది నిర్ణయాలను నిర్ధారించనుందా అనే క్రమంలో స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత పరిణామ పరిస్థితులను అనుగుణంలోకి తీసుకుంటే ఫారెస్ట్ శాఖ కి సమాచారం ఇవ్వని మండల ప్రజా పరిషత్ వ్యవస్థ రెవెన్యూ శాఖను స్పందించనున్నారా అనే ఆలోచన కూడా స్థానికల్లో అనివార్యంగానే ఉంది. అవకాశం ఇస్తే నిర్ధారణ చేయటానికి రెవిన్యూ శాఖ పట్టు బిగించి ఉందని రెవెన్యూ అధికారులు తెలుపుతున్నారు.

**ఏ.ఆర్ పల్లి ఎస్సై సింహ వివరణ**

చట్టం ఎవరికీ చుట్టం కాదని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి ఒక్క క్షణం కూడా ఆలోచింపజేయనని, ప్రస్తుతం పెంట్లం గ్రామపంచాయతీ కార్యాలయంలో సీసీటీవీ ఫుటేజ్లు లేకపోవడం వల్ల దొంగలను కనిపెట్టడం కష్టతరమైందని, స్థానిక ఎంపీడీవో సెక్రటరీ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపడుతున్నామని, త్వరలోనే ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన దుండగులను కనిపెట్టే ప్రయత్నంలో పోలీస్ శాఖ పక్క నిఘా పెట్టిందని అత్యంత త్వరగా నిందితులను కనిపెట్టి న్యాయస్థానంలో నిలబెట్టడానికి సిద్ధంగా ఉన్నానని మీడియా ముఖంగా తెలియజేశారు.

**ఎంపీడీవో వివరణ**

మాజీ ఎంపీడీవోకి మొక్కలు మాదే నరుక్కుంటామని చెప్పటం అబద్ధమని, ఏ అధికారి కూడా ప్రభుత్వ సోమవారం ధ్వంసం చేయటానికి దాసోహ పడరని, ప్రస్తుత ఎంపీడీవో లక్ష్మి రాజేశ్వరి కి కూడా ఎలాంటి సమాచారం లేకుండా అర్ధరాత్రి సెలవు దినాల్లో గుట్టు చప్పుడు కాకుండా నరికారని, సుమారుగా పెట్లం గ్రామపంచాయతీ కార్యాలయం లో 10 వరకు భారీ వృక్షాలు ఉన్నాయని ప్రస్తుతం జరిగిన సంఘటనపై సెక్రటరీ వెంకటమ్మ ద్వారా స్టేషన్లో ఫిర్యాదు చేశామని, జరిగిన సంఘటనను ఆసరాగా తీసుకొని నిఘా విధిస్తే మళ్లీ మొక్కలు నరకడానికి వచ్చే అవకాశాలు ఉన్నాయని, కేసు నమోదు అయితుందన్న భయంతో మళ్లీ అర్ధరాత్రి టేకు దొంగ దుంగలను కార్యాలయం పరిసర ప్రాంతాల్లో తీసుకొచ్చి పడవేసి పారిపోయి ఉండొచ్చని , స్థానికంగా ఉన్న ప్రజాపాలకుడునీ సంప్రదించి నరికిన టేకు మొక్కలను కార్యాలయానికి ఉపయోగపడే వస్తువులు తయారు చేయించడం, లేదా పోలీస్ శాఖకు గాని, ఫారెస్ట్ శాఖకు గాని అప్పగిస్తానని తెలిపారు.

# పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్





**ఖమ్మం, ఆగస్టు 22, నేటి శుభోదయ :** ఖమ్మం ప్రకాష్ నగర్ బీఆర్ఎస్ నాయకులు దడాల రఘు అత్త గ దొంతరబోయిన సైదమ్మ ప్రధమ వర్ధంతి కార్యక్రమానికి మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ హాజరై నివాళులు అర్పించారు.రఘునాథపాలెం మండలం గణేశ్వరం గ్రామం బీఆర్ఎస్ నాయకులు గాజుల వీరయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించారు. వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.కార్యక్రమంలో నాయకులు పగడాల నాగరాజు,భీరెడ్డి నాగచంద్ర రెడ్డి,బచ్చు విజయ్ కుమార్,బత్తుల మురళి,దడాల రఘు,వీరునాయక్,పిన్ని కోటేశ్వరరావు,యాస రామారావు,మెంటం రామారావు, గాదె అనిల్, హనుమంత్ రావు,ఎల్లబాబు,గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# భారత పత్రికా మండళ్ల సమాఖ్య జాతీయ సదస్సుకు గవర్నర్ కు ఆహ్వానం



**రాజేంద్రనగర్, ఆగస్టు 22, నేటి శుభోదయ :** హైదరాబాద్ లో రెండు రోజుల పాటు జరిగే భారత పత్రికా మండళ్ల సమాఖ్య జాతీయ సదస్సును తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ప్రారంభిస్తారు. మంగళవారం నాడు లోక్ భవన్ లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లను హైదరాబాద్ పత్రికా మండలి ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల నేతృత్వంలో ప్రతినిధి బృందం కలిసింది. జాతీయ స్థాయిలో జరిగే ఈ సదస్సు ప్రారంభ ఆహ్వాన విందుకు హాజరవుతానని గవర్నర్ తన అంగీకారం తెలిపారు. జాతీయస్థాయిలో మీడియా పోకడలు ఎదుర్కొంటున్న సవాళ్లు, విలేకరుల పనితీరుపై గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల సందేశం ఇస్తారు. పత్రికా మండలి ఉపాధ్యక్షుడు ఏ. రాజేష్, సంయుక్త కార్యదర్శులు చిలుకూరి హరిప్రసాద్, వర్దిల్లి బాపూరావు, కోశాధికారి రమేష్ వైట్ల, కార్యవర్గ సభ్యుడు ఎన్. శ్రీనివాస్ రెడ్డి తదితరులు గవర్నర్ ను కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. ఇదే సందర్భంగా గవర్నర్ కు హైదరాబాద్ పత్రికా మండలి డైరీని పాలక మండలి అందజేసింది. గవర్నర్ కు పూల మొక్కను అందజేసి సత్కరించారు. ఈ నెల 21వ తేదీన తాజ్ కృష్ణ హోటల్ లో జరిగే ఈ సదస్సు ప్రారంభ ఆహ్వాన విందు కార్యక్రమానికి గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ముఖ్య అతిథిగా విచ్చేస్తారు. దేశం నలుమూలల నుంచి సీనియర్ విలేకరులు భారత పత్రికా మండళ్ల సమాఖ్య రెండు రోజుల సదస్సుకు హాజరవుతారు.

# ప్రగతి ఎన్క్లేవ్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

**- హైడ్రా బృందంతో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అట్టేపల్లి రామప్రభు**



**మియాపూర్, ఆగస్టు 22, నేటి శుభోదయ :** మియాపూర్ డివిజన్ ప్రగతి ఎన్క్లేవ్‌లోని బచ్‌పన్ స్కూల్ సమీపంలో గత కొన్ని రోజులుగా తీవ్రంగా వేధిస్తున్న డ్రైనేజీ క్లీనింగ్ మరియు దుర్గంధం సమస్యపై హైడ్రా మాన్సూన్ టీమ్ అధికారులతో ప్రగతి ఎన్క్లేవ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు.స్కూల్ పరిసర ప్రాంతాల్లో డ్రైనేజీ పొంగిపొర్లుతుండటంతో వచ్చే విపరీతమైన దుర్గంధపు వాసన వల్ల స్థానిక నివాసితులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అసోసియేషన్ నాయకులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వర్షాకాలం దృష్ట్యా వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, తక్షణమే డ్రైనేజీ పనులు చేపట్టి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరారు.ఈ వినతిపై సానుకూలంగా స్పందించిన హైడ్రా మాన్సూన్ బృందం, యుద్ధ ప్రాతిపదికన రెక్టిఫికేషన్ (మరమ్మతు) పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రగతి ఎన్క్లేవ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అట్టేపల్లి రామప్రభు , వైస్ ప్రెసిడెంట్ ఖాజా, ట్రెజరర్ చంద్రహాస్, ప్రకాష్, నాయుడు, అట్టేపల్లి ప్రశాంత్ తదితర కాలనీవాసులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# మార్తాండ్ నగర్‌లో పటేల్ జనరిక్ మెడికల్ స్టోర్ ప్రారంభోత్సవం ..



**కొండాపూర్, ఆగస్టు 22, నేటి శుభోదయ :** కొండాపూర్ డివిజన్ మార్తాండ్ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పటేల్ జనరిక్ మెడికల్ స్టోర్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొండాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్ హాజరై వారి చేతుల మీదుగా మెడికల్ స్టోర్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా హమీద్ పటేల్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన మందులను అందుబాటులో ఉంచడంతో పాటు, సరసమైన ధరలకు జనరిక్ మందులు లభించేలా పటేల్ జనరిక్ మెడికల్ స్టోర్ సేవలు అందించాలని ఆకాంక్షించారు. ప్రజల నమ్మకం, ఆదరణను పొందుతూ వ్యాపారంలో మంచి పేరు సంపాదించి, భవిష్యత్తులో మరిన్ని శాఖలుగా విస్తరించాలని ఆయన ఆకాంక్షించారు. నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.ప్రారంభోత్సవ కార్యక్రమంలో మొహ్మద్ అలీ, కాశీం సాహెబ్, జహీద్ భాయ్, గఫూర్ భాయ్, మొయిజ్ పటేల్, షాబీర్ సాహెబ్, తిరుపతి పటేల్, దామోదర్, సయ్యద్ సాయిద్ అహ్మద్, మొహ్మద్ అమీర్, వసీం సాహెబ్, అంజి, అజ్జు, ఫహీం, శంషు, షేక్ అస్లాం, ముక్తార్, మహబూబ్, కచ్చావా దీపక్ తదితరులు పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620

## చురుకుగా పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు..



**దేవరకద్ర, ఆగస్టు 22, నేటి శుభోదయ :** దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలో పారిశుధ్య కార్మికులు చురుకుగా పనులు చేస్తున్నారు. ప్రతిరోజు తెల్లవారుజామున గ్రామాన్ని కార్మికులు శుభ్రం చేస్తున్నారు. ఎక్కడ కూడా చెత్తాచెదారం ఉండకుండా వాటిని శుభ్రం చేస్తున్నారు. కార్మికుల కూడా ప్రభుత్వము వేతనాలు పెంచాలని కార్మికులు కోరుతున్నారు. గతంలో గ్రామపంచాయతీ ఉన్నప్పటి నుంచి అవే వేతనాలు ఇప్పుడు ఇస్తున్నారని ఇప్పుడు మున్సిపాలిటీ అయినందుకు వేత్తనాలు కాస్త ఎక్కువ ఇచ్చేందుకు అధికారులు ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

## జిల్లా పోలీసు అధికారుల సంఘం ఎన్నికల్లో ధర్పల్లి సర్కిల్ నుంచి హెడ్ కానిస్టేబుల్ సురేష్ బండారి



**నిజామాబాద్ రూరల్, ఆగస్టు 22, నేటి శుభోదయ :** ధర్పల్లి మండల కేంద్రంలో జరిగిన జిల్లా పోలీసు అధికారుల సంఘం ఎన్నికల్లో ధర్పల్లి సర్కిల్ నుంచి హెడ్ కానిస్టేబుల్ సురేష్ బండారి (H.C 1734) అత్యధిక మెజారిటీతో ఘన విజయం సాధించారు.ప్రస్తుతం సిరికొండ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన విజయం సాధించిన అనంతరం మాట్లాడారు. పోలీసు సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.తన గెలుపుకు సహకరించిన తోటి పోలీసు సిబ్బందికి, ప్రోత్సహించిన ఉన్నతాధికారులకు సురేష్ బండారి ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఎన్‌డీపీఎస్ కేసుల దర్యాప్తుపై పోలీసు అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ

**- దర్యాప్తులో చిన్నపాటి లోపాలకు కూడా తావులేకుండా చట్టపరమైన నిబంధనలను ఖచ్చితంగా పాటించాలి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**



**ఖమ్మం, ఆగస్టు 22, నేటి శుభోదయ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎన్‌డీపీఎస్ చట్టానికి సంబంధించిన కేసుల దర్యాప్తుపై పోలీసు అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణా తరగతులను నిర్వహించారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, ఈగల్ ఫోర్స్ ఎల్.హెచ్. రాజేశ్వరరావు ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శిక్షణా కార్యక్రమాన్ని శనివారం కొత్తగూడెం ఐఎంఈ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేశారు.శిక్షణలో ఎన్‌డీపీఎస్ కేసుల్లో నిందితుల గుర్తింపు, అరెస్టు, సీజ్ ప్రక్రియ, పంచనామా, సాక్ష్యాల సేకరణ, కేసు దర్యాప్తు, చార్జ్‌షీట్ దాఖలు తదితర అంశాల్లో పాటించాల్సిన చట్టపరమైన విధానాలపై సమగ్ర అవగాహన కల్పించారు.అదేవిధంగా ఎన్‌డీపీఎస్ చట్టంలోని వివిధ సెక్షన్లు, వాటి అమలు విధానం, కోర్టు విచారణ సమయంలో ఎదురయ్యే అంశాలు, దర్యాప్తులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సాక్ష్యాధారాల పరిరక్షణ తదితర అంశాలను వివరించారు. దర్యాప్తులో చిన్నపాటి లోపాలు కూడా కోర్టు విచారణ సమయంలో న్యాయపరమైన సమస్యలకు దారితీసే అవకాశం ఉన్నందున, ప్రతి దశలోనూ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు.డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు పోలీసులు మరింత సమర్థవంతంగా పనిచేయాలని, ఎన్‌డీపీఎస్ కేసుల్లో దర్యాప్తు నాణ్యతను మెరుగుపరచి నిందితులకు చట్టపరంగా శిక్ష పడేలా పటిష్టమైన ఆధారాలతో కేసులను దర్యాప్తు చేయాలని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎల్.హెచ్. రాజేశ్వరరావు సూచించారు.జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ దర్యాప్తులో చోటుచేసుకునే లోపాలను గుర్తించి వాటిని సవరించుకోవడంతో పాటు, కేసుల పురోగతిపై పోలీసు అధికారులు శిక్షణలో తెలియజేసిన సూచనలు పాటించాలని సూచించారు. ప్రతి కేసులోనూ దర్యాప్తు అధికారులు చట్టపరమైన నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ, పక్కా ఆధారాలతో కేసులను బలోపేతం చేయాలని సూచించారు.ఈ సందర్భంగా శిక్షణా తరగతులు నిర్వహించి పోలీసు అధికారులకు, సిబ్బందికి చట్టపరమైన అంశాలపై అవగాహన కల్పించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఎల్.హెచ్. రాజేశ్వరరావు, ఫణి కుమార్‌లను జిల్లా ఎస్పీ అభినందించి సన్మానించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, పాల్వంచ డిఎస్పి ఆర్.సతీష్ కుమార్, మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి, ఇల్లందు డిఎస్పి వెంకన్న బాబు, భద్రాచలం డిఎస్పి అరుణ్ కుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 22ఏ భూముల వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలి

- **మంత్రి పొంగులేటి రాజీనామా చేయాలి : ఖమ్మం కలెక్టర్‌కు బీజేపీ జిల్లా అధ్యక్షులు కోటేశ్వరరావు ఫిర్యాదు**



**ఖమ్మం, ఆగస్టు 22, నేటి శుభోదయ :** తెలంగాణలో 22 ఏ నిషేధిత భూముల జాబితా వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. భూములను నిషేధిత జాబితాలో చేర్చడం, తొలగించడం వంటి వ్యవహారాల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై పూర్తిస్థాయి విచారణ అవసరమని పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఖమ్మం జిల్లా కలెక్టర్‌కు ఆయన ఫిర్యాదు సమర్పించారు.22ఏ భూముల వ్యవహారంలో అవకతవకలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోటేశ్వరరావు కోరారు. ప్రజల భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడం, యాజమాన్య హక్కులపై అనిశ్చితి నెలకొనడం వంటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు

**చేర్పులు, తొలగింపులపై ఆడిట్ చేయాలి**

గత ప్రభుత్వ కాలం నుంచి ఇప్పటివరకు 22ఏ నిషేధిత భూముల జాబితాలో జరిగిన చేర్పులు, తొలగింపులపై సమగ్ర ఆడిట్ నిర్వహించాలని బీజేపీ డిమాండ్ చేసింది. భూముల రికార్డుల్లో జరిగిన మార్పులను పరిశీలించేందుకు డిజిటల్ రికార్డులు, వ్యవస్థలో నమోదైన మార్పుల వివరాలను సాంకేతికంగా పరిశీలించాలని కోరింది. భూ రికార్డుల మార్పుల్లో అక్రమాలకు పాల్పడినట్లు తేలితే సంబంధిత అధికారులు, మధ్యవర్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొంది. తప్పుగా 22ఏ జాబితాలో చేర్చిన భూములను గుర్తించి, అర్హులైన భూ యజమానులకు న్యాయం చేయాలని కోరింది.

**ఆరోపణలపై విచారణ జరపాలి**

ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ నుంచి మంత్రి కుటుంబానికి సంబంధించిన సంస్థలకు ఆస్తులు బదిలీ అయ్యాయన్న ఆరోపణలపైనా సమగ్ర విచారణ జరిపించాలని కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ ఆరోపణల్లో వాస్తవాలను అధికారిక దర్యాప్తు ద్వారా తేల్చాలని కోరారు.

22ఏ భూముల వ్యవహారంపై రాష్ట్రస్థాయి విచారణకు బదులుగా స్వతంత్ర సంస్థతో దర్యాప్తు జరిపించాలని, అవసరమైతే కేంద్ర దర్యాప్తు సంస్థ లేదా స్వతంత్ర న్యాయ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

**బాధితులకు తక్షణ ఉపశమనం**

22ఏ జాబితా కారణంగా భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు, భూ యజమానులకు తక్షణ ఉపశమనం కల్పించాలని బీజేపీ నేతలు కోరారు. ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో పరిశీలించి, హక్కుదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భూ రికార్డుల్లో మార్పులకు సంబంధించిన సమాచారం భద్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, విచారణ పూర్తయ్యే వరకు కీలక రికార్డులను పరిరక్షించాలని కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. 22ఏ భూముల వ్యవహారంలో ప్రజలకు పూర్తి పారదర్శకత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్తా వెంకటేశ్వర్లు, నాయకులు నున్న రవికుమార్, ఆర్ వి ఎస్ యాదవ్, మందడపు సుబ్బారావు, శ్రీరామనేనీ మణి, రీగన్ ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు..

## దేవరకద్రలో కళగా మిగిలిపోయిన మినీ ట్యాంక్ బండ్ నిర్మాణం పనులు..

## శిలాఫలకానికి పరిమితం..

**దేవరకద్ర, ఆగస్టు 22, నేటి శుభోదయ :** దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో పెద్ద చెరువు వద్ద మినీ ట్యాంక్ బండ్ నిర్మాణం పనులు చేపడతామని చెప్పి దాదాపు కొన్ని సంవత్సరాలు అయినా కూడా ఇప్పటివరకు పనులు పూర్తి కాలేదు . 16 5 2017 లో 5 కోట్ల56 లక్షలు వ్యయంతో ట్యాంక్ బండ్ నిర్మాణం పనులకు అప్పటి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ప్రస్తుత ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శిలాఫలకానికి శంకుస్థాపన చేయడం జరిగింది. మినీ ట్యాంక్ బండ్ నిర్మాణ పనులు శిలాఫలకానికి పరిమితమయ్యాయి.





ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో మినీ ట్యాంక్ బండ్ నిర్మాణం పనులు పూర్తయిన కూడా దేవరకద్రలో మాత్రం ఇప్పటివరకు పనులు పూర్తి కాలేదు. మినీ ట్యాంక్ బండ్ నిర్మాణం పనులు ఏర్పాటు అయితే యువకులకు ప్రజలకు ఎంతో హల్లదకరంగా వాతావరణం ఉంటుందని ప్రజలు అన్నారు. ఇప్పటికైనా ప్రజా పాలన ప్రభుత్వము స్థానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి చొరవ తీసుకొని దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో మినీ ట్యాంక్ బండ్ నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేయాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు .

**గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే పూర్తి కాలేదు...**

దేవరకద్ర నియోజకవర్గంలో మినీ ట్యాంక్ బండ్ నిర్మాణం పనులు కాంట్రాక్టర్ అలసత్వం గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లనే పూర్తి కాలేకపోయిందని పట్టణానికి చెందిన పలువురు నాయకులు ఆరోపించారు. త్వరగా మినీ ట్యాంక్ బండ్ నిర్మాణం పనులు చేపట్టాలని నాయకులు కోరారు.

## ఖమ్మం నగరపాలక సంస్థలో ఉద్యోగుల జేఏసీ ఏర్పాటు



**ఖమ్మం, ఆగస్టు 22, నేటి శుభోదయ :** ఖమ్మం నగరంలో గల జీఎంఆర్ ఫంక్షన్ హాల్ లో ఖమ్మం నగరపాలక సంస్థ అధికారులు, ఉద్యోగులు, కార్మికుల అందరితో కలిపి సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయడం జరిగింగి. ఈ సమావేశంలో జేఏసీ ఏర్పాటు చేయడం జరిగింది. సుధాకర్ అధ్యక్షత వహించిన ఈ సమావేశం లో ముఖ్య అతిథి గా పాల్గొన్న ఏలూరు శ్రీనివాసా రావు టిజిఓ రాష్ట్ర అధ్యక్షులు, టిజేఏసి సెక్రటరీ జనరల్ మాట్లాడుతూ మన హక్కులకోసం ఖమ్మం కార్పొరేషన్ లోని అన్ని విభాగాల అధికారులు , ఉద్యోగుల, కార్మికులు అందరూ ఏకమై తమకు రావాల్సిన న్యాయపరమైన హక్కులకోసం కలిసి పోరాడాలని , జిల్లా , రాష్ట్ర స్థాయిలో లోని ఉద్యగ సంఘాలు అన్ని కూడా మీకు తోడుగా మీరు సాగించే ప్రతి పోరాటం లో ముందు వరసలో ఉంటాయని హామీ ఇచ్చారు. గుంటుపల్లి శ్రీనివాస రావు టిఎన్జీస్ జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ ఖమ్మం కార్పొరేషన్ లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు ఈ మధ్య కాలంలో అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఉద్యోగుల హక్కుల పోరాటాలలో మీకు తోడుగా జిల్లా జేఏసీ మొత్తం ఉంటుంది అని హామీ ఇచ్చారు. ఈ సమావేశం లో కొణిదెన శ్రీనివాస్ టిఎన్జీఎస్ జిల్లా కార్యదర్శి, మోదుగు వేలాద్రి టిజిఓ జిల్లా కార్యదర్శి, జడ్ ఎస్ జైపాల్ విజయ్ కుమార్ టిఎన్జీఓ ఆర్గనైజింగ్ సెక్రటరీ, బెజ్జంకి ప్రభాకర చారి టిఎన్జీఓ నగర అధ్యక్షులు పాల్గొని కార్పొరేషన్ ఉద్యగ, కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సమావేశం లో ఖమ్మం నగరపాలక సంస్థలో అన్ని విభాగాల లలో పనిచేస్తున్న 500 మంది అధికారులు, ఉద్యోగులు, అవుట్సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు. అనంతరం కేఎంసి జేఏసీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. జేఏసి చైర్మన్ జి శ్రీనివాస రావు, జేఏసీ గౌరవ అధ్యక్షులు గా ఏ సుధాకర్, జేఏసీ కన్వీనర్ గా బుర్రి వెంకటేశ్వర్లు ను ఎన్నుకోవడం జరిగింది. మొత్తం 42 తో నూతన జేఏసీ కమిటీ ను ఎన్నుకోవడం జరిగింది.